# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 254 | గురువారం 28 మార్చి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# మూడు స్థానాలపై సస్పెన్స్!

- టీకాంగ్రెస్ అభ్యర్థుల లిస్ట్..
- ఇప్పటికే రాష్ట్ర, జిల్లా నేతలు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల అభి ప్రాయాలను ఏఐసీసీ స్వీకరణ
- వారిచ్చిన సూచనలు, సలహాల మేరకు ఆశావహుల అభ్యర్థిత్వాలను పరిశీలించి ఫైనల్ చేసే అవకాశం
- సీఈసీ వివిధ సర్వేల నివేదికలు, పార్టీ విధేయత ఆధారంగా అభ్యర్థులపై ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం
- కరీంనగర్ తెరపైకి తీన్మార్ మల్లన్న

ఢిల్లీ:

తెలంగాణలో మిగిలి ఉన్న ఎనిమది లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అధిష్టానం బుధవారం అభ్యర్థుల్ని ఖరారు చేయనుంది. ఇందుకోసం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) మరోమారు భేటీ కానుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో పార్టీ మాజీ చీఫ్‌లు సోనియాగాంధీ, రాహుల్‌తో పాటు కమిటీ సభ్యులు కేసీ వేణుగోపాల్, అంబికాసోనీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అలాగే సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొననున్నారు. ఇక, ఎనిమిది స్థానాల్లో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర, జిల్లా నేతలు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల అభి ప్రాయాలను ఏఐసీసీ స్వీకరించింది. వారిచ్చిన సూచనలు, సలహాల మేరకు ఆశావహుల అభ్యర్థి త్వాలను పరిశీలించి తుది జాబితాను సీఈసీకి పంపింది. ప్రజల్లో బలం, కుల సమీకరణలు, పార్టీకి చేసిన సేవల ఆధారంగా అభ్యర్థుల పేర్లను నేతలు సిఫారసు చేశారు. కాగా సీఈసీ వివిధ -మిగతా3లో





## ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో
# మరో ట్విస్ట్

- 15 మంది అధికారులు చెప్పు చేతుల్లో కీలుబొమ్మగా ఎస్ఐబీ
- అధికారులు ఎస్ఐబి కంట్రోల్ చేసినట్లుగా గుర్తింపు
- ముగ్గురు మాజీ ఎస్పీలు, ఐదుగురు అదనపు ఎస్పీల కంట్రోల్‌లో ఎస్ఐబీ
- ప్రణీతరావుకి పూర్తిగా ఐదుగురు ఇన్స్పెక్టర్లు సహకరించినట్లు గుర్తింపు

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు పోలీసులు ముమ్మరం చేశారు. 15 మంది అధికారులు చెప్పు చేతుల్లో ఎస్ఐబీ కీలుబొమ్మగా మారింది. అధికారులు ఎస్ఐబి కంట్రోల్ చేసినట్లుగా గుర్తించారు. రిటైర్డ్ ఐజీ ప్రభాకర్‌రావుతో పాటు ఒక మాజీ డీఐజీ నేతృత్వంలో ఎస్ఐబీ నడిచింది. ముగ్గురు మాజీ ఎస్పీలు, ఐదుగురు అదనపు ఎస్పీల కంట్రోల్‌లో -మిగతా3లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో
# కేసీఆర్‌దే ముఖ్యపాత్ర

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 కేసీఆర్, ఏ2 కేటీఆర్..
- కాంగ్రెస్ నేత తీవ్ర ఆరోపణలు
- కేసీఆర్, కేటీఆర్ కూడా జైలుకు వెళ్లి కవితకు కంపెనీ ఇవ్వాల్సిందే
- కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని నిలదీత
- మీ ప్రమేయం లేదనుకుంటే లైడిటెక్టర్ టెస్టుకు వస్తారా? అని సవాల్
- ఫోన్ ట్యాపింగ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి వందల కోట్లు సంపాదించారని ఆరోపణ



హైదరాబాద్:

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏ1, ఏ2 ముద్దాయిలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో కానిస్టేబుల్ బదిలీ కావాలన్నా కేటీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే చేసేవారని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కి ప్రధాన కారణం వారిద్దరే అని.. వారికీ జైలు శిక్ష పడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని విమర్శించారు. "తిండి లేకుండా బతకవచ్చు గానీ స్వేచ్ఛ లేకుండా బతకలేం. మానవ హక్కులను కాలారాస్తూ ట్యాపింగ్ చేయడం క్షమించరాని నేరం. భువనగిరి నుంచి నన్ను పోటీ చేయాలని రాజగోపాల్ రెడ్డి కోరారు. నన్ను గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని రాజగోపాల్ అంటున్నారు. నాకు పోటీ చేయడం ఇష్టం లేదని చెప్పా. స్వాతంత్ర్యానంతరం -మిగతా3లో



## కేరళ సీఎం విజయన్ కూతురిపై ఈడీ కేసు

- వీణా విజయన్ కంపెనీకి ఓ సంస్థ అక్రమ చెల్లింపులు చేసిందనే ఆరోపణలు
- ఎస్ఎఫ్ఐఓ ఫిర్యాదు చేయడంతో ఈడీ కేసు నమోదు
- కొచ్చికి చెందిన కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీకి, వాణి విజయన్ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్‌ల మధ్య వ్యాపార ఒప్పందం

## పొంచి ఉన్న
# నీటి గండం

- సమ్మర్‌కు ముందే త్రాగు నీటి కష్టాలు
- సాగుకు నీళ్లు అందక ఎండిపోతున్న పొలాలు
- ఇక ప్రధాన నగరాల్లో తాగు నీటికి మొదలైన ఇబ్బందులు
- అధికంగా నీళ్లు వినియోగిస్తే ప్రభుత్వం జారిమానా విధించే స్థాయికి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



హైదరాబాద్

వేసవి ప్రారంభంలోనే తెలంగాణలో తాగు, సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. సాగుకు నీళ్లు అందక పొలాలు ఎండిపోతున్నాయి. ఇక ప్రధాన నగరాల్లో తాగు నీటి ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రజలు నీటి ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. కర్ణాటకలో నీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయి. ఆ రాష్ట్ర రాజధాని బెంగళూరులో అయితే తాగునీటికి మరింత ఇబ్బంది పడుతున్నారు ప్రజలు. భూగర్భ జలాలు అడుగంటిపోతుండడంతో... అధికంగా నీళ్లు వినియోగిస్తే ప్రభుత్వం జారిమానా విధించే స్థాయికి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కృష్ణా నది తీరంగా క్రాఫ్ హాలీడే -మిగతా3లో

## రబ్రీదేవిలా సునీత సీఎం స్థానంలో కూర్చుంటారు

- కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్
- లాలూ ప్రసాద్ అరెస్టయ్యాక రబ్రీదేవి పొలిటికల్ స్క్రీన్ పైకి వచ్చారన్న కేంద్రమంత్రి
- అలాగే సునీత ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపడతారని వ్యాఖ్య
- ఇటీవల లైవ్ వీడియోలో తన భర్త స్థానంలో కూర్చున్న సునీత



## రేవంత్ రెడ్డి మోదీ మనిషా?
# రాహుల్ గాంధీ మనిషా?

- ఎన్నికల తర్వాత రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం
- ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ సంచలన కామెంట్స్..
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారు
- నామినేషన్లకు ఇంకా సమయం ఉంది
- నీకు దమ్ముంటే చెప్పు ఇద్దరం పోటీ చేద్దాం
- నరుకుడు.. ఉరుకుడు తప్ప రేవంత్‌కు ఏదీ చేతకాదు

హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మోదీని సపోర్టు చేస్తున్నాడా? లేక రాహుల్ మనిషా? అని మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్లు వేశారు. ఎన్నికల తర్వాత రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం అని వ్యాఖ్యలు. అలాగే, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. కాగా, కేటీఆర్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. చేవెళ్లలో ఈ మధ్య రేవంత్ దమ్ముంటే 17 ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ ఒక్కటైనా గెలవాలి అన్నాడు. అక్కడ ఇక్కడా ఎందుకు రేవంత్ సిట్టింగ్ సీటు మాల్కాజ్‌గిరిలోనే ఇద్దరం -మిగతా3లో



# భార్యను సెకండ్ హ్యాండ్ అన్నందుకు..
# రూ 3 కోట్లు జరిమానా విధించిన కోర్టు



కొన్ని భార్యభర్తల కేసులు కనువిప్పు కలిగిస్తాయి. ఎందుకంటే భార్యను తేలికగా చేస్తూ ఎలా పడితే అలా కించపరుస్తూ మాట్లాడే భర్తల ఆగడాలను ఎలా కట్టడి చేయాలో చెబుతాయి. అలాంటి గమ్మత్తైన ట్విస్టింగ్ కేసు ఇది! ఆ దంపతులిరువురిది సంపన్న కుటుంబ నేపథ్యం. ఇద్దరు ఉన్నత విద్యావంతులే. ఆ జంట వివాహం 1994 జనవరి 3వ తేదీన పెద్దల సమక్షంలో జరిగింది. ఆ తర్వాత ఇద్దరు అమెరికా వెళ్లి అక్కడే ఉద్యోగాలు చేశారు. అయితే అక్కడ చట్టాల ప్రకారం సెక్యూరిటీ కోసం అమెరికాలో మళ్లీ పెళ్లి చేసుకుంది ఆ జంట. అంతా సవ్యంగా సాగుతున్న తరుణంలో వారి కాపురంలో కలతలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో 2005లో ఈ దంపతులు ముంబై తిరిగి వచ్చేశారు. ముంబైలోనే భార్య ఉద్యోగం సంపాదించింది. అయితే భర్తతో గొడవలు కారణంగా తల్లి ఇంట్లోనే ఉంటుంది. 2014లో భర్త తిరిగి అమెరికా వెళ్లిపోయాడు.

2017లో భార్యకు అమెరికా నుంచే విడాకుల నోటీసులు పంపాడు. అదే ఏడాది భార్య ఇండియాలోని ముంబై కోర్టులో గృహ హింస చట్టం కింద కేసు ఫైల్ చేసింది. ఏడాది తర్వాత అంటే 2018లో అమెరికా కోర్టు వారికి విడాకులు కూడా మంజూరు చేసింది. అసలు కథ ఇక్కడే మొదలైంది..ముంబై కోర్టులో భార్య దాఖలు చేసిన పిటీషన్ ఆసక్తికరంగా మారింది. సుదీర్ఘ విచారణకు దారితీసింది. దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. పెళ్లి తర్వాత హనీమూన్‌కని నేపాల్ వెళ్లిన తర్వాతే ఈ ఇరువురి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. భార్యను సెకండ్ హ్యాండ్ అంటూ పదేపదే కించపరిచే వాడు భర్త.

అందుకు కారణం..అప్పటికే తన భార్యకు.. తన పెళ్లి కంటే ముందే నిశ్చితార్థం అయ్యి క్యాన్సిల్ కావటం. ఆ తర్వాత అతడితో పెళ్లి జరిగింది. దీంతో భర్త ఆమెను పదేపదే సెకండ్ హ్యాండ్ అని కించపరిచేవాడు. అలాగే అమెరికా వచ్చిన ఆమె తల్లిదండ్రును అత్యంత నీచంగా చూసేవాడు. పైగా ఆమె తండ్రికి గుండె ఆపరేషన్ జరిగితే మరో ఇంట్లో ఉంచమని గొడవ చేసేవాడని భార్య పిటిషన్‌లో స్పష్టం చేసింది. గృహ హింస తీవ్ర స్థాయిలో ఉందని.. అనేక మానసిక వేధింపులు, హింసకు గురైనట్లు భార్య తన పిటీషన్‌లో పేర్కొంది. భార్య వాదనలతో ఏకీభవించిన ముంబై కోర్టు.. 2017లో తీర్పు వెల్లడించింది. భార్యకు ప్రతినెలా లక్షా 50 వేల రూపాయల భరణం, సెకండ్ హ్యాండ్ అంటూ కించపరిచినందుకు 3 కోట్ల రూపాయల పరిహారం, కోర్టు ఖర్చుల కింద 50 వేల రూపాయలు చెల్లించాలని భర్తను ఆదేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ..భర్త సెషన్స్ కోర్టుకు వెళ్లాడు. అక్కడ కూడా భార్యకు అనుకూలంగానే తీర్పు వచ్చింద. ఇక లాభం లేదని ఈ తీర్పులపై ముంబై హైకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేశాడు భర్త. సుదీర్ఘ విచారణ తర్వాత.. ముంబై హైకోర్టు కింది రెండు కోర్టుల తీర్పుని సమర్థిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది. భార్యను సెకండ్ హ్యాండ్ అంటూ కించపరిచి.. మానసిక వేదనకు గురి చేసిన భర్త.. 3 కోట్ల రూపాయల పరిహారం చెల్లించాల్సిందే అని ముంబై హైకోర్టు తీర్పు వెల్లడించింది. భార్య ఆత్మగౌరవాన్ని దెబ్బతిసే అధికారం భర్తకు లేదని స్పష్టం చేసింది. ఇరువురు ఉన్నత చదువులు చదువులు, మంచి ఉద్యగాల్లో స్థిరపడినవారు, పైగా సమాజంలో తమకంటూ ఓ గుర్తింపు ఉన్నవారు.. అలాంటివారు మరోకరి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడ సబబు కాదని పేర్కొంది. ముఖ్యంగా భార్యను సెకండ్ హ్యాండ్ అంటూ.. ఓ మహిళ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటం అనేది సామాజిక రుగ్మతగా పరిగణించాలని స్పష్టం చేసింది. ఇలాంటి వాటిని ఉపేక్షించటం అనేది సహించరాని నేరం అని పేర్కొంది. ఉన్నత పదవుల్లో ఉండేవారు.. మరొకరికి మార్గదర్శకంగా ఉండాలని వక్కాణించింది. అస్సలు ఒక మహిళ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉండకూడదు అంటూ మండిపడింది ముంబై హైకోర్టు. అందుకుగానూ భార్యకు రూ. 3 కోట్ల రూపాయలు చెల్లించాల్సిందేనని భర్తను ఆదేశిస్తూ ధర్మాసనం తీర్పు వెల్లడించింది. ఈ తీర్పు నిజంగా ఎందరో భర్తలకు కనువిప్పు అనే చెప్పాలి. ఎప్పుడూ భార్యను చులకన చేసి ఆమె ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా భర్తలకు ఈ తీర్పు పెద్ద చెంపదెబ్బ అని చెప్పొచ్చు.

# కంగనా, మమతపై ఈసీ కన్నెర్ర

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ మహిళా నేత సుప్రియా శ్రీనాథే, బీజేపీ నేత దిలీప్ ఘోష్‌లకు కేంద్ర ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మహిళలను కించపరిచేలా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈసీ ఈ చర్యలు చేపట్టింది. ఇది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల కోడ్)ని ఉల్లంఘించినట్లు ఈసీ తెలిపింది. మార్చి 29 సాయంత్రం 5 గంటల వరకు సుప్రియా శ్రీనాథే, దిలీప్‌ఘోష్ తమ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని పేర్కొంది. కాగా హిమాచల్ ప్రదేశ్‌లోని మండి స్థానం నుంచి కంగనా రనౌత్‌ను బీజేపీ ఎన్నికల బరిలోకి దించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కంగనా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ సుప్రియా శ్రీనాథే సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారమే రేపాయి. అనంతరం ఆమె ట్వీట్‌కు కంగనా ధీటుగా బదులిచ్చారు. అయితే ఆ పోస్టు తాను చేయలేదని, తన



సోషల్ మీడియా అకౌంట్ యాక్సెస్ కలిగిన ఎవరో చేసి ఉంటారని సుప్రియా తెలిపారు.

మరోవైపు పశ్చిమ బెంగాల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ కూడా మహిళా గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడంపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. బర్ధమాన్-దుర్గాపూర్ లోక్‌సభ స్థానం నుంచి లోక్‌సభ బరిలో నిలిచచిన దిలీప్ ఘోష్ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ కుటుంబ నేపథ్యాన్ని ఎగతాళి చేశారు. రాష్ట్ర కుమార్తెగా చెప్పుకుంటున్న మమతా..ముందుగా తన తండ్రి ఎవరో నిర్ణయించుకోవాలని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే మహిళల గౌరవాన్ని తగ్గిస్తూ.. అభ్యంతరకరమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ ఇరు నేతలకు ఈసీ షోకాజ్ నోటీసులు ఇచ్చింది.

## ఆ 3వేల కోట్లను ప్రజలకే అందిస్తాం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ బీజేపీ అభ్యర్థికి కీలక హామీ ఇచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అవినీతి పరులు దోచుకున్న పేద ప్రజల సొమ్ముని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసిందని, తిరిగి ఆ సొమ?్మను వారికే చెందేలా కృషి చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు సమీపి స్తున్న తరుణంలో ప్రధాని మోదీ పశ్చిమ బెంగాల్‌లోని ఆయా లోక్‌సభ స్థానాల బీజేపీ అభ్యర్థులకు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. ఎన్నికల ప్రచారంపై ఆరా తీస్తున్నారు. మంగళవారం సందేశ్‌ఖాలీ బాధితురాలు, బసిర్‌హట్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రేఖ పత్రతో మాట్లాడిన మోదీ.. ఇవాళ పశ్చిమ బెంగాల్ కృష్ణానగర్ లోక్‌సభ అభ్యర్థి, తృణముల్ కాంగ్రెస్ మహిళా నేత మహువా మొయిత్రాపై పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి రాజమాత అమ్రితా రాయ్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా పేదల ప్రజల సొమ్మును అవినీతిపరులు దోచుకున్నారని ప్రధాని అన్నారు. వారి నుంచి ఈడీ జప్తు చేసిన ఆస్తులు, డబ్బులు తిరిగి వారికే చెందేలా చట్టపరమైన అవకాశాలను అన్వేషిస్తున్నట్లు అమృతా రాయ్‌తో ప్రధాని మోదీ చెప్పారంటూ బీజేపీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంతే కాదు, ఈడీ అటాచ్ చేసిన సొమ్ము విషయంలో తన స్టాండ్ ఏంటో పశ్చిమ బెంగాల్ ప్రజలకు అమ్రితా రాయ్ చెప్పాలని ప్రధాని మోదీ కోరారు. త్వరలో అందుకు తగ్గట్లుగానే చట్టాపరమైన మార్గాల ద్వారా పేద ప్రజలకు సొమ్ము చేరవేస్తామని మోదీ.. అమ్రితా రాయ్‌కు చెప్పినట్లు సమాచారం. పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు అమ్రితా రాయ్‌తో మాట్లాడే సమయంలో ప్రధాని మోదీ ప్రస్తావన తెచ్చిన ఆ రూ. 3 వేల కోట్లు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో పలువురు ఉద్యోగాల కోసం లంచంగా చెల్లించిన మొత్తం సొమ్మేనని, ఆ సొమ్మును ఈడీ అటాచ్ చేసింది. తిరిగి ఎవరైతే జాబ్ కోసం డబ్బులు చెల్లించారో వారికే ఆ సొమ్ము అందించనున్నట్లు కమలం నేతలు చెబుతున్నారు.

# అభ్యర్థుల ప్రకటన..
# ఉద్ధవ్ వర్గంపై కాంగ్రెస్ నేత తీవ్ర విమర్శలు



ముంబై: మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ కూటమి నేతల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. శివసేన (ఉద్ధవ్ వర్గం)పై కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యసభ ఎంపీ సంజయ్ నిరుపమ్ తీవ్రంగా విమర్శలు గుప్పించారు. శివసేన వాయువ్య ముంబై అభ్యర్థిని కిచిడీ ఛోర్ అంటూ మండిపడ్డారు. కాగా మహా వికాస్ అఘాడి కూటమిలో, ఎన్సీపీ(శరద్‌చంద్ర పవార్), కాంగ్రెస్, శివసేన(యూబీటీ) పార్టీలు ఉన్నాయి. ఈ క్రమంలో శివసేన బుధవారం 17 మంది లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. అటు కాంగ్రెస్ కూడా పట్టుబడుతున్న ముంబై సౌత్ సెంట్రల్ స్థానాన్ని అనిల్ దేశాయ్‌కి కేటాయించింది. వాయువ్య ముంబై నుంచి ఎంపీ గంజనన్ కీర్తికర్ కుమారుడు అమోల్‌ను శివసేన పోటీలోకి దింపింది. ఈ విషయంపై నిరుపమ్ స్పందిస్తూ.. అమోల్‌కు టికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ముంబై నార్త్-వెస్ట్ స్థానానికి అమోల్ కీర్తికర్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం కూటమి ధర్మ ఉల్లంఘనగా పేర్కొన్నారు. శిసేన అభ్యర్థిని 'కిచిడి చోర్‌గా అభివర్ణించారు. అలాంటి వారి కోసం తాము పనిచేయమని పేర్కొన్నారు. 'ముంబైలోని ఆరు లోక్ సభ స్థానాల్లో అయిదు చోట్ల శివసేన పోటీ చేస్తుంది. కేవలం ఒక సీటును కాంగ్రెస్‌కు కేటాయించింది. దీన్ని బట్టి ముంబైలో కాంగ్రెస్‌ను మట్టికరిపించేందుకు శివసేన ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. శివసేన ఇలాంటి తీవ్రమైన నిర్ణయం తీసుకొని ఉండకూడదు. దీని వల్ల కాంగ్రెస్‌కు భారీ నష్టం జరుగుతుం ది. ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకోవాలి. లేకపోతే శివసేనతో పొత్తు విరమించుకునే ఆలోచన చేయాలి. ఒకవేళ శివసేన తాము ఒంటరిగా పోరాడగలమని భావిస్తే అది తమ అతిపెద్ద తప్పు. శివసేన ఇలా జాబితాను ప్రకటించడం కాంగ్రెస్ నాయకత్వ వైఫల్యంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ నిర్ణయం కోసం వారం రోజులు వేచిచూస్తా. ఆ తర్వాత తను చేయాల్సింది చేస్తా' నని పేర్కొన్నారు.

**కిచిడీ స్కామ్‌లో అమోల్‌కు సమన్లు**

అయితే శివసేన టికెట్ ఇచ్చిన అమోల్‌కు కిచిడీ కుంభకోణంలో ఈడీ ఆయనకు సమన్లు జారీ చేసింది. కరోనా సమయంలో వలస కూలీలకు కిచిడీ పంపిణీ చేసేందుకు ఇచ్చిన కాంట్రాక్టుల విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఆ కుంభకోణం విచారణలో భాగంగా తాజాగా చర్యలు చేపట్టింది.

ఇక మహారాష్ట్రలో మొత్తం 48 లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో 44 స్థానాలకు మహా వికాస్ అఘాడీ కూటమి పార్టీల మధ్య సర్దుబాటు జరిగింది. ఇందులో భాగంగా శివసేన (యూబీటీ) 19, కాంగ్రెస్ 16, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ పార్టీకి 9 సీట్లను కేటాయించారు. మిగతా నాలుగు స్థానాలకు చర్చలు జరుగుతున్నాయి. ఈలోపే శివసేన బుధవారం 17 మంది లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించింది. అంతేగాక తమ పార్టీ 22 చోట్ల పోటీ చేయనున్నట్లు సంజయ్ రౌత్ ప్రకటించారు.

## సంచలనం..
## 70,000 మంది ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు



ప్రైవేట్ కంపెనీల్లో గత కొన్ని నెలలుగా లేఆఫ్‌ల గురించి వింటున్నాం. ముఖ్యంగా ఐటీ సంస్థలు లేఆఫ్‌ల పేరుతో వేలాది సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వాలు సైతం వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించడం సంచలంగా మారింది. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ రాబోయే నెలల్లో 70,000 మంది ప్రభుత్వ ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించారు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి దూకుడు వ్యూహాన్ని ప్రదర్శించారు. ఈ తొలగింపులు అర్జెంటీనాలోని 35 లక్షల మంది ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పోలిస్తే తక్కవే అయినప్పటికీ కార్మిక సంఘాల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురుకావచ్చిన భావిస్తున్నారు. అర్జెంటీనా దేశంలో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల ఒప్పందం మార్చి 31తో ముగియనుంది. గతేడాదే కాంట్రాక్ట్ ముగిసినప్పటికీ ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించింది. అన్యాయమైన తొలగింపులను సహించబోమని యూనియన్ నాయకులు హెచ్చరించారు. దీనికి సంబంధించి రాబోయే రోజుల్లో కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

## కేరళ సీఎం విజయన్ కూతురిపై ఈడీ కేసు



**న్యూఢిల్లీ:** కేరళ సీఎం పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌తో పాటు ఆమె ఐటీ కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేశాయి. వీణా విజయన్ కంపెనీకి ఓ సంస్థ అక్రమ చెల్లింపులు చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) ఫిర్యాదు చేయడంతో ఈడీ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

**రూ. 1.72 కోట్ల చెల్లింపులు**

కొచ్చికి చెందిన కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీకి, వాణి విజయన్ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్‌ల మధ్య వ్యాపార ఒప్పందం జరిగింది. ఒప్పం దం మేరకు ఎటువంటి సేవలు అందించనప్పటికీ 2017- 2018 మధ్య కాలంలో సీఎంఆర్ఎల్.. ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కి రూ. 1.72 కోట్ల చెల్లింపులు జరిపింది.


**ఐటీ అధికారుల సోదాలతో వెలుగులోకి**

అయితే ఆదాయపు పన్ను మధ్యంతర పరిష్కార బోర్డు (%×త్వతీఱఎ దీశ్మీుతీఱ%) సీఎంఆర్ఎల్ కార్యాలయంలో సోదాలు నిర్వహించింది.ఆ సోదాల్లో ఇరు కంపెనీలకు చెందిన లావాదావీలకు సంబంధించిన పలు ఆధారాలు లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా ఎస్ఎఫ్ఐఓ వాణి విజయన్ కంపెనీ ఎక్సాలాజిక్ సొల్యూషన్‌పై విచారణ చేపట్టింది. ఈ విచారణకు వ్యతికేకంగా ఎక్సాలాజిక్ సొల్యూషన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సైతం ఎక్సాలాజిక్ పిటిషన్‌ను కొట్టి వేసింది. తాజాగా ఎస్ఎఫ్ఐఓ ఆదేశాలతో ఈడీ కేసు నమోదు చేసింది.

**ఆరోపణలు అవాస్తవం**

ఇదే అంశంపై ఈ ఏడాది జనవరి అసెంబ్లీ సమావేశాల్లో కేరళ సీఎం పనిరయి విజయన్ స్పందించారు. తన భార్య పదవీ విరమణ నిధులతో తన కుమార్తె కంపెనీని ప్రారంభించిందని, తనపై, తన కుటుంబంపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని అన్నారు.

## కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ లెవల్స్ పడిపోతున్నాయి



ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టయిన సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని ఆప్ వర్గాలు వెల్లడించాయి. కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ లెవల్స్ పడిపోతున్నాయని ఆప్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ మధుమేహంతో బాధపడుతున్నారని, గత కొన్ని రోజులుగా ఆయన షుగర్ లెవల్స్ లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని వివరించారు. ఓ దశలో కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ 46ఎంజీ/డీఎల్ గా నమోదైందని ఓ నేత తెలిపారు. బ్లడ్ షుగర్ ఈ స్థాయికి పడిపోవడం చాలా ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారని వెల్లడించారు. కాగా, కేజ్రీవాల్ అర్ధాంగి సునీత నిన్న జైలుకు వెళ్లి భర్తను పరామర్శించారు. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితి పట్ల ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడుతూ, కేజ్రీవాల్ మధుమేహంతో బాధపడుతున్నారని, ఆయన షుగర్ స్థాయి అదుపు తప్పిందని వివరించారు.

## రబ్రీదేవిలా సునీత సీఎం స్థానంలో కూర్చుంటారు




ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత మరో రబ్రీదేవి అని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. బీహార్‌లో పశుగ్రాసం కేసులో లాలూ ప్రసాద్ యాదవ్ అరెస్టయ్యాక రబ్రీదేవి పొలిటికల్ స్క్రీన్‌పైకి వచ్చారని, ఆ తర్వాత క్రమంగా ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారని, ఇప్పుడు అదే తరహాలో సునీత ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపడతారని వ్యాఖ్యానించారు. ఢిల్లీ తాత్కాలిక సీఎంగా సునీత పాలనా పగ్గాలు చేపడతారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ లైవ్ వీడియోలో తన భర్త కేజ్రీవాల్ ఎక్కడ కూర్చుంటారో అక్కడే సునీత కూర్చున్నారు. దీంతో ఆమె తాత్కాలిక సీఎంగా బాధ్యతలు చేపడతారనే ఊహాగానాలకు బలం చేకూరింది.

# మూడు స్థానాలపై సస్పెన్స్!

-మొదటి పేజి తరువాయి

సర్వేల నివేదికలు, పార్టీ విధేయత ఆధారంగా అభ్యర్థులపై ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే రెండు దఫాల్లో ఏఐసీసీ తొమ్మిది అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే.

మరోవైపు.. ఈ ఎనిమిదింటిలో మూడు పార్లమెంట్ స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం, భువనగిరి, నిజామాబాద్ స్థానాలపై కాంగ్రెస్ నేతలు కుస్తీ పడుతున్నట్టు తెలుస్తోంది. ఖమ్మం నుండి పొంగులేటి ప్రసాద్ రెడ్డి, మల్లు నందిని, యుగెంధర్, రాజేంద్ర ప్రసాద్ టికెట్ ఆశిస్తున్నారు. ఇక, భువనగిరి నుండి టికెట్ కోసం చామల కిరణ్, కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, గుత్తా అమిత్, కోమటి రెడ్డి ఫ్యామిలీ ప్రయత్నాలు చేస్తోంది. లేనిపక్షంలో బీసీ అభ్యర్థికి ఈ స్థానం కేటాయించే అవకాశం ఉన్నట్టు పార్టీలో చర్చ జరుగుతోంది. భువనగిరి లోక్‌సభ స్థానానికి ఓయూ విద్యార్థి నేత కైలాష్ అప్లికేషన్ పెట్టుకున్నారు.

**కరీంనగర్ తెరపైకి తీన్మార్ మల్లన్న**

ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి తొలి నుంచి మాజీ ఎమ్మెల్యే ఎ.ప్రవీణ్‌రెడ్డి పేరు పరిశీలనలో ఉన్నప్ప టికీ, అక్కడే బీజేపీ నుంచి బండి సంజయ్, బీఆర్ఎస్ నుంచి వినోద్‌కుమార్ పోటీలో ఉన్న నేపథ్యంలో అక్కడ మరో అభ్యర్థిని పరిశీలించాలని ఏఐసీసీ సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తీన్మార్ మల్లన్న పేరును తెరపైకి తెచ్చి నట్లు సమాచారం.



**ముగ్గురిలో ఎవరు?**

నిజామబాద్ టికెట్ బరిలో జీవన్ రెడ్డి, సునీల్ రెడ్డి, అనిత రెడ్డి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు.. హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని మస్కత్ ఆశిస్తున్నారు. వరంగల్ స్థానంపై దమ్మాటి సాంబయ్య ఆశలు పెట్టుకున్నారు. మెదక్ రేసులో నీలం మధు ఉన్నారు. ఆదిలాబాద్ సీటు కోసం ఆదివాసీ, లంబాడ నాయకుల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎవరికి టికెట్ వస్తుందోనన్న సస్పెన్స్ కొనసాగుతోంది.

# పొంచి ఉన్న నీటి గండం...

-మొదటి పేజి తరువాయి

ప్రకటించారు. ఎగువ నుంచి కృష్ణా నదికి నీరు రాకపోవడంతో తెలంగాణలో నీటి సమస్యలుఉద్ధృతం అవుతున్నాయి. గోదావరి పరీవాహకంలో సైతం ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి.గత ఏడాది వర్షాలు బాగానే కురిసినా.... జలాశయాలు(, డ్యాంలు, చెరువుల్లో నీటిమట్టం క్రమంగా తగ్గిపోతుంది. కాలువ నుంచి నీరు అందకపోవ దంతో రైతులు బోర్లపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. దీంతో ఉపరితల జలవనరులు తగ్గిపోతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండడంతో జలశయాల్లో నీటి వనరులు తగ్గడానికి ఓ కారణంగా కనిపిస్తోంది. వేసవిలో సాధారణం కంటే నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. పైగా ఎండల తీవ్రతకు నీటి వనరులు తగ్గుతుంటాయి. తెలంగాణలో ప్రస్తుతం నీటి సమస్యలుప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలో నీటి వినియోగం భారీగా పెరుగుతోంది. జలశయాల్లో నీరు తగ్గుతుండ దంతో... అధికారులు తాగునీటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో సాగుకు నీరు అంతంత మాత్రంగానే అందుతోంది. దీంతో పంటలు సాగు చేసిన రైతులు...బోర్లపై ఆధారపడుతున్నారు.కృష్ణా నదిపరీవాహకంలో ఈ ఏడాది వర్షాలు తగినంత పడలేదు. దీంతో ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహం తగ్గింది. ఎగువ నుంచి జూరాలకు 154 టీఎంసీలు, శ్రీశైలానికి 115 టీఎంసీలు మాత్రమే వచ్చాయి. నారాయణపూర్ జలశయంలో ప్రస్తుతం 20 టీఎంసీలు నిల్వ ఉండగా.... వేసవి నీటి ఎద్దడిని తట్టుకునేందుకు తెలంగాణకు కనీసం 5 టీఎంసీలు నీరు దిగువకు విడుదల చేయాలని కర్ణాటకను( కోరాలని తెలంగాణ ప్రభుత్వం



నిర్ణయించింది. జూరాల జలాశయంలో నీళ్లు అడుగంటుతు న్నాయి. జూరాల కింద పంటలు ఎండిపోతున్నాయి. వానాకాలం తర్వాత కర్ణాటక నుంచి జూరాలకు కనీసంర 2.5 టీఎంసీల నీరు వచ్చేది కానీ ఈ ఏడాది నీరు రాలేదు. దీంతో జూరాలలో నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాల కారణంగా... ఈ ప్రాజెక్టుల్లో నీటిని ఖాళీ చేశారు. మేడిగడ్డ పిల్లర్లుకుంగడంతో...నీటిని దిగువకు వదిలేస్తున్నారు. అన్నారం బ్యారేజీలోనూ బుంగల కారణంగా నీటిని దిగువకు వదిలేశారు. ప్రస్తుతం ఎత్తిపోతలు నిలిచిపోవడంతో... ఎల్లంపల్లి, మిడ్, లోయర్ మానేరుల్లో నీటి మట్టాలు అడుగంటాయి. గత కొన్ని రోజులుగా ఈ జలాశయాల కింద సాగు, తాగునీటి అవసరాలకు పెద్దఎత్తున నీటిని వినయోగిస్తున్నారు. శ్రీరామసాగర్, మిడ్ మానేరు, లోయర్ మానేరు( నుంచి నీటి వినియోగం పెరిగింది. ఈ ప్రాజెక్టుల పరిధిలో నీటి సమస్యలు తలెత్తున్నాయి. ఈ జలశయాల దిగువన ఉన్న పొలాలకు సాగు నీరు అందకపోవడం పంటలు ఎండిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టులో కూడా నీటి మట్టం వేగంగా తగ్గిపోతుంది. నదిలో ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. శ్రీశైలం జలాశయంలో ప్రస్తుత నీటి మట్టం 810.80 అడుగులకు చేరుకుంది. నాగార్జునసాగర్ తో కూడా నీటి మట్టాలు వేగంగా తగ్గుతున్నాయి.హైదరాబాద్, కరీంనగర్, యాదాద్రి సహా పలు జిల్లాల్లో తాగునీటికి ప్రజలుఇబ్బంది పడుతున్నారు. భూగర్భజలాలు తగ్గిపోవడంతో... తగినంత తాగునీరు దొరక్క నగరాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ఆరంభంలోనే ఎండలు తీవ్రంగా ఉండడంతో నీటి సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు అంటున్నారు. మార్చి నెల నాటికే భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోయాయి. చెరువులు, కాలువలు ఎండిపోతుంటే... నదుల్లో సైతం నీరు వేగంగా తగ్గిపోతుంది. ఉపనదుల్లో చుక్క నీరు కనిపించడలేదు. తెలంగాణ వ్యాప్తంగా 142 పట్టణాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని అధికారులు అంటున్నారు. మార్చి నాటికే పరిస్థితి ఇలా ఉంటే ఇక రాబోయే రెండు నెలల్లో తాగునీటి సమస్యలు తీవ్రం అవుతాయని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్యలు తీవ్రం కాకముందే ప్రభుత్వం క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తం చేసింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌దే ముఖ్యపాత్ర

-మొదటి పేజి తరువాయి

దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారంతా నక్సలిజం వైపు మళ్లారు. ఉమ్మడి రాష్ట్రంలో కమ్మ, రెడ్లు రాజ్యమేలారు. తెలంగాణ వచ్చిన తర్వాత రావులు రాజ్యం ఏలారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరుగుతోంది" అని మధుయాష్కీ అన్నారు.

**ఫోన్ ట్యాపింగ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి వందల కోట్లు సంపాదించారని ఆరోపణ**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లు జైలుకు వెళ్లాల్సిందేనని మహబూబ్ నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వారి కుటుంబం మొత్తం తీహార్ జైలుకు వెళ్లి కవితకు కంపెనీ ఇవ్వాల్సిందేనని వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బయటకు వచ్చాక కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ వ్యవహారంలో కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని నిలదీశారు. ఇందులో మీ ప్రమేయం లేకపోతే లైడిటెక్టర్ టెస్టుకు వస్తారా? అని సవాల్ చేశారు. ఢిల్లీ మద్యం కేసులో కవిత తీహార్ జైలుకు వెళ్తే కేటీఆర్ మాత్రం ఎమ్మెల్సీ సీటు కోసం గోవాలో క్యాంపులు వేశాడని విమర్శించారు. బ్లాక్ మెయిల్ చేసి వందల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కోసం నవీన్ రావు, శ్రవణ్ రావులు సర్వర్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేశారన్నారు.

**కాళేశ్వరం అవినీతిలో బీజేపీకి వాటా ఉందని ఆరోపణ**

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, తన భర్త కొండా మురళి ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేశారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందన్నారు. తన తండ్రి అధికారంలో ఉన్నప్పుడు కవిత మద్యం అక్రమ వ్యాపారం చేశారని ఆరోపించారు. అవినీతి సొమ్ముతో కేసీఆర్ కుటుంబం కోట్లకు



పడగలెత్తిందన్నారు. కాళేశ్వరం అవినీతిలో బీజేపీకి వాటా ఉందని, మేఘా కృష్ణారెడ్డి బీజేపీకి వెయ్యి కోట్ల రూపాయలను పార్టీ ఫండ్‌గా ఇచ్చారని ఆరోపించారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఆ పార్టీ నోరు మెదపడం లేదన్నారు.

**ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్, హరీశ్‌ను ముద్దాయిలుగా చేర్చండి: రఘునందన్ రావు**

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ అంశం తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. లోక్ సభ ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ అంశంపై దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల సమయంలో తన ఫోన్ కూడా ట్యాప్ చేశారని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. తన కుటుంబ సభ్యుల మొబైల్ కూడా ట్యాప్ చేశారని వివరించారు. ఆ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పడంతో తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని రఘునందన్ రావు తెలిపారు. తన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్, దుబ్బాక ఎన్నికల ఇంచార్జ్ హరీష్ రావు, కలెక్టర్ వెంకట రామిరెడ్డిని ముద్దాయిలుగా చేర్చాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కొనుగోలు చేసింది ఎవరు..?**

ఫోన్ ట్యాపింగ్ డివైస్ కొనుగోలు చేసింది ఎవరని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డీజీపీని రఘునందన్ రావు కోరారు. లేదంటే కోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశా రు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్ మోహన్ రెడ్డి, కర్ణాటకలో కుమార స్వామికి లబ్ధి చేకూరేలా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను తెలంగాణ రాష్ట్రంలో ట్యాపింగ్ జరిగిందని పేర్కొన్నారు. సబితా ఇంద్రారెడ్డిపై పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి అందేలా శ్రీరాములు యాదవ్ నంబర్ కూడా ట్యాప్ చేశారని రఘునందన్ రావు ఆరోపించారు. హైకోర్టు జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు.

**సినీ ప్రముఖుల ఫోన్లు**

ట్యాపింగ్ గురించి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు చెప్పాలని రఘునందన్ కోరారు. సినీ పరిశ్రమలో ఉన్న ప్రముఖులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఫోన్లను వదల్లేదన్నారు. వారిలో కొందరికి ఫోన్ చేసి బెదిరించి డబ్బులు వసూల్ చేశారని ఆరోపించారు. మాజీమంత్రి హరీశ్ రావు బినామీ చానెల్ ఓనర్ ఫోన్ కూడా ట్యాప్ చేశారని రఘునందన్ వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రణీత్ రావు ఇచ్చిన స్టేట్ మెంట్ పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

## ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ట్విస్ట్

-మొదటి పేజి తరువాయి



ఎస్ఐబీ నడిచింది. అదనపు ఎస్పీ భుజంగరావు, తిరుపతన్నను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా ముగ్గురు అదనపు ఎస్పీలు, ఐదుగురు డిఎస్పీలు అక్కడే తిష్ట వేశారు. ప్రణీత రావు నేతృత్వంలో మాజీ అధికారులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. ప్రణీతరావుకి పూర్తిగా ఐదుగురు ఇన్స్పెక్టర్లు సహకరించినట్లు గుర్తించారు. ఎస్ఐబిలో మొత్తం 38 మంది సిబ్బందితో ప్రణీత్‌రావు లాగర్ రూమ్ నడిపారు. ప్రభాకర్ రావు ఆదేశాలతో పలువురి నంబర్లను ట్రాప్ చేసిన మాజీలు.. రిటైర్డ్ అయిన అధికారులు ఓఎస్డీ పేరుతో ఎస్ఐబీలో చలామణి అయ్యారు. సర్వీస్‌లో ఉన్న అధికారుల పేర్లతో ఓఎస్డీలు అక్రమాలను సిట్ గుర్తించింది. ప్రణీత్ రావుకి సహకరించిన వారందరినీ విచారించేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు.

## రేవంత్ రెడ్డి మోదీ మనిషా? రాహుల్ గాంధీ మనిషా?

-మొదటి పేజి తరువాయి



పోటీ చేద్దామని అన్నాను. కానీ, ఉలుకుపలుకు లేదు. నామినేషన్లకు ఇంకా సమయం ఉంది. నీకు దమ్ముంటే చెప్పు ఇద్దరం పోటీ చేద్దాం. నరుకుడు.. ఉరుకుడు తప్ప రేవంత్‌కు ఏదీ చేతకాదు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు ఇష్టం వచ్చినట్టు తిడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క వర్గం కూడా ఆనందంగా లేదు. రేవంత్ రెడ్డి మోదీ మనిషా? రాహుల్ గాంధీ మనిషా? అర్దం కావడం లేదు. ఒక్క ఓటు రేవంత్ రెడ్డికి వేసినా అది మోదీకి వేసినట్టే. ఎన్నికల తర్వాత రేవంత్ బీజేపీలో చేరటం ఖాయం. ఈటల రాజేందర్ ఇంకా తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని అనుకుంటున్నాడు. గడిచిన పదేళ్లలో మోదీ ప్రభుత్వం కంటోన్మెంట్‌కు ఏం చేసిందో దమ్ముంటే ఈటల రాజేందర్ సమాధానం చెప్పాలి. రాజేందర్ మంచి డైలాగ్స్ కొడతాడు. అవి చూసి ఓట్లు వేయకండి. కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన నాయకులే మల్కాజ్‌గిరిలో పోటీ చేస్తున్నారు. విషం చిమ్ముతున్న బీజేపీ, అబద్దాలతో బతుకుతున్న కాంగ్రెస్‌కు, మనకు మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ఇస్తామన్న ఆరు గ్యారంటీలు పక్కకుపోయాయి. ఆరు గారడీలు తెర మీదకు వచ్చాయి. ఇదే సమయంలో ఫోన్ ట్యాపింగ్స్‌పై కూడా కేటీఆర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. 10 లక్షల మంది ఫోన్లు ట్యాపింగ్ చేశారని రేవంత్ చెబుతున్నారు. ఒక్కరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ చేసి ఉండొచ్చు. అవి దొంగ పనులు చేసేవారివి అనుకుంటాను. మీకు దమ్ముంటే విచారణ చేసుకోండి. రేవంత్ రెడ్డి ఓ లీకుల వీరుడు' అంటూ ఎద్దేవా చేశారు.

## ఖాకీ మాటున ట్యాపింగ్ దందా

**హైదరాబాద్ :** వాళ్లు ఖాకీలు కాదు.. ఖతర్నాక్ రౌడీలు.. ప్రభుత్వ పెద్దలు చెప్పిందే వారికి వేదం. చట్టాన్ని చుట్టంగా మార్చుకొని.. ప్రజల కోసం కాకుండా.. అమాత్యుల కోసం పనిచేసి.. ఇప్పుడు కటకటాల్లోకి వెళ్లారు. అయితే ఖాకీ డ్రెస్‌ను అడ్డంగా పెట్టుకొని చేసిన దారుణాలు, దందాల గుట్టు రట్టైంది. విపక్ష నేతలనే కాదు.. ఇంకా చాలా అంశాలపై జరిగిందీ ఈ ట్యాపింగ్ దందా. అంతేకాదు కొందరు సూత్రధారుల పేర్లు కూడా బయటికి వచ్చాయి.ఇప్పటివరకు మనమనుకున్నదేంటి.. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు విపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారు. కానీ విషయం మరింత ఉంది. తవ్వుతున్న కొద్దీ అన్ని షాకింగ్ విషయాలే. ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న కీ ప్లేయర్లు కాగా.. ఈ ట్యాపింగ్ టీమ్‌కు కెప్టెన్లుగా వ్యవహరించింది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు.. వీరు నేతల ఫోన్లు మాత్రమే కాదు. రియల్ ఎస్టేట్ పెద్దలు.. వ్యాపారులు, హవాలా చేసేవారిని కూడా.. టార్గెట్ చేసింది ఈ ట్యాపింగ్ ముఠా.ఏం చేస్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? తమ పార్టీ నేతలను ఏమైనా సంప్రదిస్తున్నారా? ఎవరెవరు ఏ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు? ఇలా కొన్ని డౌట్స్‌తనేతల ఫోన్లను ట్యాప్ చేశారనుకుందాం. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, హవాలా దందా చేసే వారి ఫోన్లను ట్యాప్ చేయడం ఎందుకు? ఇప్పుడీ క్వశ్చనే కాస్త ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి అప్పుడు టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి ఆరోపణలను రిమైండ్ చేసుకోవాలి.ఇవే అప్పుడు ఆయన చేసిన అలిగేషన్స్. అప్పటి అలిగేషన్స్‌కు.. ఇప్పుడు బయటపడుతున్న విషయాలకు లింక్ ఉన్నట్టు అనిపిస్తోంది కదూ. ఫండ్స్ మరే ఇతర పార్టీకి వెళ్లకుండా అడ్డుకోవడం ఫస్ట్ టార్గెట్ అయితే.. ఆ ఫండ్స్ మొత్తం బీఆర్ఎస్‌కే రావడం సెకండ్ టార్గెట్. ఇదే కాన్సెప్ట్‌తో ట్యాపింగ్ దందా కొనసాగిందన్న ఆరోపణలకు ఇప్పుడు బలం చేకూరింది. 36 మంది రియల్‌ఎస్టేట్ బిల్డర్లు.. జ్యువెలరీ వ్యాపారుల ఫోన్లు ట్యాప్ అయ్యాయి. ఇదీ అఫిషియల్ ఇన్ఫర్మేషన్.. ఫోన్లు చేయడం.. డబ్బులు డిమాండ్ చేయడం.. ఫలానా నేతతో ఎందుకు మాట్లాడుతున్నావని బెదిరించడం. ఇవీ ఇప్పటి వరకు తెలిసిన విషయాలు.. మరిన్ని విషయాలు బయటికి రావాల్సి ఉంది.ప్రస్తుతం విచారణలో నోరు తెరుస్తున్నారు అధికారులు.. ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు చెప్తేనే ఫోన్ ట్యాప్ చేశారు. భుజంగరావు, తిరుపతన్న ఇచ్చిన నెంబర్స్ కూడా ట్యాప్ చేశాను. మా కాన్సన్‌ట్రేషన్ మొత్తం నేతల కదలికలు, నిధుల సమీకరణ.. సోసైటీ పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్న కొందరి ఫోన్లు కూడా ట్యాప్ చేశాం. చేసిందంతా ఉన్నతాధికారులు చెప్పారనే.. ఇదీ పోలీసుల విచారణలో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు చెప్పిన విషయాలు. అంతేకాదు హార్డ్ డిస్కులు ఎందుకు పనికిరాకుండా డిస్ట్రాయ్ చేసి.. ఆ ముక్కలను వెళ్లి మూసీలో నిమజ్జనం చేశామన్నారు ప్రణీత్‌రావు.మరో కీలక అధికారి కూడా భుజంగరావు కూడా నోరు తెరుస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక నేత ఇచ్చిన నెంబర్స్‌ను మాత్రమే ట్యాప్ చేశాను. ఆ నేతలిచ్చిన నంబర్స్.. ప్రణీత్‌రావుకు.. ప్రణీత్‌రావు ఇచ్చిన ఇన్ఫోని.. మళ్లీ బీఆర్ఎస్ నేతకు అందించాడు. ఈ ఆపరేషన్ అంతా ఎలా జరిగిందో విచారణలో పూసగుచ్చినట్టు చెప్పారు భుజంగరావు.సో.. ఇద్దరి స్టేట్‌మెంట్స్‌ను చూస్తే.. బీఆర్ఎస్ నేతలు, ఖాకీ పెద్దలు, వీరి డైరెక్షన్‌లోనే జరిగింది ఈ దందా అంతా. ప్రస్తుతం రాధాకిషన్ రావు, ప్రభాకర్ రావులో యూఎస్‌లో ఉన్నారు. కానీ ఇక్కడ ఇన్వెస్టిగేషన్ మాత్రం ఆగడం లేదు. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో వీళ్లంతా పాత్రధారులే.. సూత్రధారులు ఇంకా వేరే వాళ్లు ఉన్నారని. ఇప్పుడదే నిజమైంది. ప్రణీత్‌రావు నోటి నుంచి ఇప్పటికే పలువురు కీలక నేతల పేర్లు వచ్చాయని తెలుస్తోంది.బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న ఆ నేతలకు త్వరలోనే నోటీసులు వెళ్లనున్నాయి. మరి వారి నోటి నుంచి ఎలాంటి ఆన్సర్స్ వస్తాయి. అనేది ఇప్పుడు కాస్త ఇంట్రెస్టింగ్‌గా మారింది.కానీ ఇక్కడ సమాధానం రావాల్సిన కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. వ్యాపారులను ఎందుకు బెదిరించారు? అలా బెదిరించి వసూలు చేసిన డబ్బులు ఎక్కడికి చేరాయి? ఎవరికి చేరాయి ? ఎవరి డైరెక్షన్‌లో ఇదంతా జరిగింది ? అనేది ఇప్పుడు కాస్త ఇంట్రెస్టింగ్‌గా మారింది.

## సంపాదకీయం

# మాదకద్రవ్యాల కేంద్రంగా భారత్ !

బ్రెజిల్ నుంచి విశాఖ రేవుకు భారీ మొత్తంలో ఒక కంటెయినర్‌లో వచ్చిన మాదక ద్రవ్యాల గురించి ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. 'సంధ్య ఆక్వా కంపెనీ' చిరునామాతో వచ్చిన వాటి మార్కెట్ విలువ యాభై వేల కోట్ల నుంచి లక్ష కోట్ల రూపాయల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఆక్వా మేత తయారీకి అవసరమైన పొడి ఈస్టు పులియపెట్టేందుకు అవసరమైన శిలీంధ్రము)ను తెప్పించామే తప్ప దానిలో మాదక ద్రవ్యాల గురించి తమకు తెలియదని సదరు కంపెనీ చెబుతోంది. దీని వెనుక తెలుగుదేశం, వైసిపి, బిజెపి నేతలు కంపెనీ యజమానులతో సంబంధాల గురించి పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. బ్రెజిల్ ఎన్నికల్లో లూలా గెలిచినపుడు వైసిపి పక్ష నేతగా అభినందనలు పంపానే తప్ప వేరే సంబంధాలేవీ లేవని విజయసాయి రెడ్డి ప్రకటించుకున్నారు. సాక్షి పత్రిక వెలువరించిన కథనం తన ప్రతిష్టకు భంగం కలిగించినందున రూ.20 కోట్లకు దావా వేస్తున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రకటించారు. వివరాలు పూర్తిగా తెలియక ముందే చంద్రబాబు, లోకేష్ ముందుగానే స్పందించారంటే వారికి ముందే తెలుసు అన్నట్లుగా వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. విశాఖ రేవులో రాష్ట్ర అధికారులు సిబిఐకి సహకరించలేదనే విమర్శలు వచ్చాయి. వైసిపి నేత అభినందనలు తెలిపారంటే మాదక ద్రవ్యాలతో లూలాకూ సంబంధం ఉండవచ్చనే అనుమానాలు కలిగే విధంగా కొన్ని పత్రికల్లో రాతలు ఉన్నాయి. ప్రపంచాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో మాదక ద్రవ్యాల తయారీ, సరఫరా ఒకటి. లాటిన్ అమెరికాలో ముఠాలు అక్కడి ప్రభుత్వాల కూల్చివేతకు, ప్రజాస్వామ్యానికే ముప్పుగా ఈ ముఠాలు పరిణమించాయి. మన దేశ భద్రతకూ ప్రమాదం వస్తున్నదని అనేక మంది హెచ్చరిస్తున్నారు. గతంలో మన దేశం మాదకద్రవ్యాల సరఫరా మార్పిడి కేంద్రంగా ఉండగా ఇప్పుడు ఒక పెద్ద మార్కెట్‌గా కూడా రూపొందినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే ఇటీవలి సంవత్సరాలలో భారీ మొత్తాలలో పట్టుబడుతున్నాయి. గత ఏడాది పాకిస్తాన్ నుంచి వచ్చిన రూ.25 వేల కోట్ల విలువగల మాదక ద్రవ్యాలను మన అధికారులు పట్టుకున్నారు. అంతకు ముందు గుజరాత్ లోని ముంద్రా రేవుకు వచ్చిన రూ.21 వేల కోట్ల విలువగల మూడు వేల కిలోల మాదక ద్రవ్యాలను పట్టుకున్న అంశం తెలిసిందే. రవాణా జరుగుతున్న వాటిలో పట్టుకుంటున్న మొత్తాలు స్వల్పమే అన్న సంగతి తెలిసిందే. గతేడాది 650 బిలియన్ డాలర్ల విలువ గల లావాదేవీలు జరిగినట్లు అంచనా. చట్ట విరుద్ధమైన ప్రపంచ ఆర్థిక కార్యకలాపాల్లో 30 శాతమని అంచనా. మాదకద్రవ్యాల ముఠాలు మన దేశంపై కేంద్రీకరిస్తున్నట్లు పట్టుబడుతున్న ఉదంతాలు వెల్లడిస్తున్నాయి. లాటిన్ అమెరికా దేశాల సంఘటిత ముఠాలు ఆసియా, అందులోనూ మన దేశం మీద కేంద్రీకరించటానికి కారణం నడమంత్రపు సిరి వచ్చిన కుటుంబాలు, వారి సంపదలు పెరగటంతో పాటు మాదక ద్రవ్యాల వాడకం కూడా పెరుగుతున్నది. అమెరికా, ఇతర ధనిక దేశాలలో వీటి వినియోగం గరిష్ట స్థాయికి చేరి మార్కెట్ పెరగకపోవటం, సింథటిక్ డ్రగ్స్‌కు ప్రాధాన్యత ఇవ్వటం వంటి కారణాలతో కొత్త మార్కెట్ల వేటలో మనదేశం మీద కేంద్రీకరించారు. కొకెయిన్ తయారీకి అవసరమైన కోకా ఉత్పత్తి, దిగుబడి ఇటీవలి కాలంలో లాటిన్ అమెరికాలో విపరీతంగా పెరిగింది. కొత్త ప్రాంతాలు, దేశాలకు అది విస్తరించింది. మార్కెట్‌లో పోటీ, సరఫరాకు కొత్త మార్గాలను వెతుకుతున్నారు. మాదక ద్రవ్యాల మాఫియా కుట్రలకు బలైన వారిలో ప్రస్తుత బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డిసిల్వా ఒకరు. లాటిన్ అమెరికాలో అనేక మంది రాజకీయ నేతల్కు, మాఫియా డాన్లకు పెద్ద తేడా కనపడదు. అనేక దేశాల్లో వీరు ప్రజాస్వామిక, వామపక్ష నేతల సారధ్యంలో ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చివేయటం, అనేక మంది నేతల అపహరణ, హత్యల్లో భాగస్వాములు. బ్రెజిల్, మెక్సికో మాదక ద్రవ్య మాఫియాలకు పెట్టింది పేరు. వారు మిలిటరీతో సహా అన్ని రంగాలలో ప్రవేశించారు. అనేక దేశాల పాలకులను తెర వెనుక ఉండి నడిపించేది వారే. వామపక్ష ఉద్యమాలను అడ్డుకొనేందుకు అమెరికా ఇలాంటి శక్తులకు పూర్తి మద్దతు, అవసరమైన మారణాయుధాలను అందిస్తోంది. వారిని ప్రజాస్వామిక పరిరక్షకులుగా చిత్రిస్తోంది. బ్రెజిల్‌లో ఇలాంటి ముఠాలను అడ్డుకొనేందుకు, రవాణా నిరోధానికి లూలా ప్రభుత్వం త్రివిధ దళాల నుంచి వేలాది మిలిటరీ, ఇతర భద్రతా సిబ్బందిని రేవులు, విమానాశ్రయాల్లో నియమించాల్సి వచ్చిందంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 2023 నవంబరులో ప్రారంభించిన వేట ఈ ఏడాది మే నెల వరకు జరుగుతుందని లూలా ప్రకటించారు. దీన్ని అడ్డుకొనేందుకు మాఫియా గ్యాంగులు అనేక బస్సులు, ఒక రైలును దగ్ధం చేశాయి. అనేక నగరాల్లో ఈ శక్తుల ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం పనిచేయలేని స్థితి ఉంది. ఒక వైపు ఈ ముఠాలతో చేతులు కలిపిన రాజకీయ ప్రత్యర్థులు, మరోవైపు ఈ గ్యాంగ్‌లను ఎదుర్కొనేందుకు లూలా పని చేయాల్సి వస్తోంది. ఈ అణచివేత కారణంగానే బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్ తరలించి ఉండవచ్చు. మూడు దశాబ్దాల క్రితం 1993లో బ్రెజిల్ సావోపాలో నగర జైల్లో నేరగాళ్ల మధ్య కొట్లాట జరిగింది. కారణం ఏమిటంటే ఫస్ట్ కాపిటల్ కమాండ్ అనే కొత్త మాఫియా ఏర్పడటమే. ఇప్పుడది లాటిన్ అమెరికాలో, ప్రపంచంలో అతి పెద్ద ముఠాగా ఎదిగింది. దానిలో నలభైవేల మంది జీవిత కాల సభ్యులు, మరో అరవై వేల మంది దానితో సంబంధాలు కలిగి ఉన్నారు. వారు వివిధ దేశాల్లో విస్తరించారు. పోర్చుగల్ రాజధాని లిస్బన్ నగరంలోని జైళ్లలో ఈ ముఠాకు చెందిన వెయ్యి మంది ఉన్నారని అక్కడి అధికారులే గతేడాది వెల్లడించారు. ఈ ముఠా నైజీరియాలో కూడా పెద్ద ఎత్తున విస్తరించింది. మన దేశంలో అనేక మంది నైజీరియన్లు మాదకద్రవ్యాలతో పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. కొందరు చెబుతున్నదాన్ని బట్టి ఒక నైజీరియన్ మన దేశంలో డ్రగ్ మాఫియాను అదుపు చేస్తున్నట్లు వార్తలు. ప్రపంచంలో చీమ చిటుక్కుమన్నా పసిగట్టే శక్తి అమెరికా సిఐఎ, ఎఫ్‌బిఐలకు ఉందని చెబుతారు. పక్కనే ఉన్న మెక్సికో నుంచి వస్తున్న మాదకద్రవ్యాలను ఎందుకు అరికట్టలేకపోతోందన్నది ప్రశ్న. నిజానికి చేతగాక కాదు. ఆ ముఠాలతో అమెరికాలో ఉన్నవారికి ఉన్న లావాదేవీలే కారణం. అక్రమంగా ప్రవేశించేవారితో అమెరికాలోని పరిశ్రమలు, వ్యవసాయ క్షేత్రాలలో చౌకగా పనిచేయించుకుంటారు. మాదక ద్రవ్యాలను తెప్పించుకుంటారు. అమెరికా-మెక్సికో సరిహద్దులో డ్రగ్ మాఫియాదే రాజ్యం. వారికి తెలియకుండా అక్రమంగా ప్రవేశించేవారు ఉండరు. అక్కడి నుంచి మాదకద్రవ్యాల సరఫరా జరుగుతుంది. ఫెంటానిల్ అనే మత్తు పదార్థం ఒక బిళ్ల తయారీకి పది సెంట్లు ఖర్చు అవుతుంది. దాన్ని ఔషధం పేరుతో నకిలీ మందుల చీటీలను సృష్టించి కొనుగోలు చేసి పది నుంచి 30 డాలర్ల వంతున అమ్ముతారు. పది కిలోల ఫెంటానిల్ 50 వేల డాలర్లకు దొరికితే దాన్ని రెండు కోట్ల డాలర్లకు విక్రయిస్తారు. అమెరికాలో దీన్ని వాడి 2022లో లక్ష తొమ్మిది వేల మంది మరణించినట్లు నమోదైంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ దాన్ని ఆసరా చేసుకొని ఇష్టంలేని ప్రభుత్వాలను కూల్చేందుకు, ప్రజా ఉద్యమాలను దెబ్బ తీసేందుకు ముఠాలను అనేక దేశాల్లో అమెరికా ప్రోత్సహించింది. చివరికి అవి ఏకు మేకైనట్లుగా సంఘటిత ముఠాలుగా ఏర్పడి దేశాలనే శాసించే స్థితికి చేరాయి. తమలో తాము ఘర్షణ పడకుండా ఎవరి ప్రాంతంలో వారు దందా చేసుకొనేందుకు స్వతంత్ర (కార్టెల్స్) సంస్థలను ఏర్పాటు చేసుకొనే స్థాయికి ఎదిగాయి. అమెరికాలో తొలిసారి 1968లో అధ్యక్షుడిగా గెలిచిన రిచర్డ్ నిక్సన్ విధిలేని పరిస్థితిలో మాదక ద్రవ్యాలు పౌరుల తొలి శత్రువు అని ప్రకటించాడు. అప్పటికే హెరాయిన్, మార్జువానా అమెరికాలో విపరీతంగా పెరిగి, కొకెయిన్ రంగంలోకి వచ్చింది. మార్కెట్ ఎంతో లాభసాటిగా ఉండటంతో కార్టెల్స్‌కు శ్రీకారం చుట్టారు. ఇవి ఎంతగా ఎదిగాయంటే కరీబియన్ ప్రాంతంలో కొన్ని దీవులను కొనుగోలు చేసి అక్కడ ఆధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేసి సరకు రవాణాకు విమానాలను కూడ కొనుగోలు చేశాయి. అలాంటి సంస్థలలో విబేధాలు తలెత్తి మార్కెట్ ఆక్రమణకు కొత్త సంస్థలను ఉనికిలోకి తెచ్చారు. ప్రత్యర్థులను అంతం చేసేందుకు సాయుధ ముఠాలనూ రంగంలోకి తెచ్చారు. మాదక ద్రవ్యాల వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఉగ్రవాద సంస్థలు ఆ వైపు మళ్లాయి. అందువలన అవి చేసే కార్యకలాపాలను నార్కో టెర్రరిజం అని పిలుస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్ పాలకుల కోరిక మేరకు జోక్యం చేసుకున్న సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అక్కడ తాలిబాన్లను ప్రోత్సహించిన అమెరికా వారి చేత మాదక ద్రవ్యాలను కూడా ప్రోత్సహించింది. తరువాత వారే అమెరికాకు వ్యతిరేకంగా మారిన సంగతి తెలిసిందే.

# సైబర్ నేరాల విలువ రూ.461 కోట్లపైనే

సైబర్ మోసాలపై అవేర్‌నెస్ ఎంత పెరుగుతున్నా మోసాల సంఖ్య మాత్రం తగ్గట్లేదని రిపోర్ట్‌లను బట్టి తెలుస్తోంది. దేశవ్యాప్తంగా మూడేళ్లలో సుమారు 12 వేల సైబర్ మోసాలు జరిగాయట. దాదాపు రూ.461 కోట్ల డబ్బు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లింది. ముఖ్యంగా ఎలాంటి సైబర్ మోసాలు కామన్‌గా జరుగుతున్నాయంటే.. దేశంలో జరుగుతున్న సైబర్ మోసాల్లో క్రెడిట్ కార్డ్/ డెబిట్ కార్డ్‌ల ద్వారా జరుగుతున్న మోసాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే సరైన సెక్యూరిటీ, పాస్‌వర్డ్‌లు మెయింటెయిన్ చేయకపోవడం వల్ల ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాలు కూడా పెరుగుతున్నాయి. దీంతోపాటు మారుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ఏఐ టూల్స్ ద్వారా కూడా పలు రకాల మోసాలు అమలుచేస్తున్నారు సైబర్ నేరగాళ్లురీసెంట్‌గా జరిగిన పలు సైబర్ నేరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా జరిగిన మోసాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంటర్నెట్ సెక్యూరిటీ సంస్థ మెకాఫీ నిర్వహించిన 'ది ఆర్టిఫిషియల్ ఇంపోస్టర్' సర్వేలో సుమారు 47 మంది భారతీయులు ఏఐ వాయిస్ స్కామ్‌లను ఎదుర్కొన్నట్లు తెలిసింది. వీరిలో చాలామంది రూ.50,000 కంటే ఎక్కువ నష్టపోయారని రిపోర్ట్ ద్వారా తెలుస్తుంది. ఉచితాలు ఎలా వస్తాయని లేదా మనకెందుకు ఇస్తారని ఒక్క క్షణం ఆలోచిస్తే కష్టార్జితం మిగిలేది కదా. ఇలా ఇంటర్‌నెట్ వేదికగా ఎనో రకాల అక్రమాలకు అడ్డగా మారుతున్న సైబర్ మోసలు నగరాల నుంచి పల్లెల వరకు చేరాయి. ఇటీవల అనేక ఇంటర్‌నెట్ మోసాలు పల్లెల్లో కూడా బయటపడుతున్నాయి. పరువుపోతుందనే భయంతో బాధితులు బయటపడడంలేదు, ఫిర్యాదులు చెయ్యడం లేదు. దీని వల్ల మరి కొందరు మోసపోతున్నారు. ఇలా గత కొన్ని సంవత్సరాలుగా మోసాలు జరుగుతున్నా అవగాహన లేని వ్యక్తులు నష్టపోతూనే ఉన్నారు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి ప్రేమగా మాట్లాడి మా కంపెనీలో పెట్టుబడి పెట్టుమని కోరడంతో కొందరు దురాశకు వెళ్లి అడిగిందే తడవుగా ఆ వ్యక్తి చెప్పిన అకౌంట్‌కు డబ్బులు పంపించడం, మొదట కొంత లాభం రావడంతో నమ్మి, అప్పు తెచ్చి, మోసగాడు చెప్పిన అకౌంట్‌కు డబ్బులు పంపిస్తూ లాభం ఆశతో నష్టపోయి మోసగాడి బెదిరింపులకు భయపడి ఆత్మహత్య చేసుకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. హలో సార్ మా కంపెనీలో పెట్టుబడి పెట్టండి, మీ డబ్బులు రెట్టింపు అవుతాయి, మా లక్కీ డ్రాలో మీరు కోటి రూపాయలు గెలుచుకున్నారు. కానీ కొంచెం టాక్స్ కట్టాలి డబ్బులు పంపించండి. మీ లక్కీ ప్రైజ్ మనీని మీకు పంపిస్తాం ఛార్జీలు మీరు భరించాలి కొంత రుసుము పంపండి.. ఇలాంటి మాటలు నిజమని నమ్మి నేరగాళ్ల వలలో చిక్కి ఉన్నది పోగొట్టుకుని బంధువులకు, మిత్రులకు చెప్పలేక అప్పుల ఊబిలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అయినవారు



కొందరైతే.. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారు మరి కొందరు. మీరు ఫలానా కంపెనీలో లక్కీ కస్టమర్ హైదరాబాద్ పట్టణంలో విల్లా గెలుసుకున్నారు 10% చెల్లిస్తే మా కంపెనీ ప్రతినిధి వచ్చి మీకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు అనగానే ఎగిరి గంతేసి ఛార్జీలు చెల్లించి చివరకు మోసపోయామని లబోదిబో అన్నవారు ఆలోచించాలి. డబ్బులు పంపించి ఆర్థికంగా నష్టపోయి, ఎంతో శ్రమించి సంపాదించిన ఆస్తిని సైతం పోగొట్టుకుని రోడ్డున పడ్డ కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఉద్యోగులు, విద్యార్థులే కాకుండా రాజకీయ నాయకులు కూడా సైబర్ మోసం నుండి తప్పించుకోలేకపోతున్నారు. తక్కువ రోజుల్లో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మి ఇన్వెస్ట్ చేసి మోసపోయిన సంఘటనలు. లక్కీ డ్రా వచ్చిందంటూ మెసేజ్ రావడంతో వాటిని నమ్మి కరీంనగర్, నిజామాబాదు, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లి మరో రూ. 50 వేల చొప్పున కట్టి ఆ కంపెనీ బోర్డు తిప్పడంతో భారీగా నష్టపోయిన సంఘటనలు కూడా అనేకం చోటు చేసుకున్నాయి. ఇంటర్‌నెట్ మోసాలకు అంతే లేకుండాపోయింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన సోషల్ నెట్‌వర్క్‌లో ఒకటి ఫేస్‌బుక్. సైబర్ నేరాలకు కేరాఫ్ అడ్రస్‌గా కూడా ఫేస్‌బుక్ నిలుస్తోంది. ఫేస్‌బుక్‌ను అడ్డం పెట్టుకుని చేసే నేరాలలో అకౌంట్లను హ్యాక్ చేయడం, డబ్బును డిమాండ్ చేయడం, వివరాలను దొంగిలించడం, భావోద్వేగాలతో ఆడుకోవడం, షాపింగ్ మోసం, ఫేక్ ఫ్రెండ్ రిక్వెస్ట్, అత్యవసరంగా డబ్బులు అవసరం అనే వాటితో మోసాలు వంటివిఎన్నో జరుగుతున్నాయి. సోషల్ నెట్‌వర్క్ ద్వారా భారీ సంఖ్యలో వ్యక్తులు కనెక్ట్ అయి ఉండడం గమనించిన సైబర్ నేరగాళ్లు అందినకాడికి దోచుకుందాం అనే రీతిలో మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్‌బుక్ హ్యాకింగ్, నకిలీ ప్రొఫైల్ సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపి వివిధ కారణాలతో వేర్వేరు వ్యక్తులను సంప్రదించి, డబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తారు. ప్రొఫైల్ యజమాని ఈ విషయాన్ని తెలుసుకొని, ఈ వార్తను అందరికీ తెలియజేసే వరకు అతని ప్రొఫైల్ హైజాక్ అయిందని తెలియదు. దీంతో ఫేస్‌బుక్ ఖాతాకు చెందిన తమ స్నేహితుడి నుండి రిక్వెస్ట్ వచ్చిందని మిగతావారు నమ్ముతారు. ఇది ఫేస్‌బుక్ చీటింగ్ స్కామ్ సంబంధించిన కేసు అని ఆలస్యంగా తెలుసుకుంటారు. ఇలా కొంత మంది డబ్బు పోగొట్టుకున్నవారు కూడా ఉన్నారు. సోషల్ మీడియాలో జరిగే ఆర్థిక మోసలకు అడ్డుకట్టపడడం లేదని, మన దేశంలో సైబర్ నేరాలకు శిక్షలు కఠినంగా లేకపోవడంతో సైబర్ నేరాలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ చట్టాలలో మార్పు తీసుకు వచ్చి మరింత ఆధునిత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడం, పోలీసులు శాఖ ప్రత్యేక నిఘా విభాగాలు ఏర్పాటు చేయడం, ముఖ్యంగా ప్రజల్లో అవగాహన కల్పించడం వల్ల ఇలాంటి మోసాలను కట్టడి చేయవచ్చునీ గ్రహించాలి.

# ఎక్స్‌కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్

19 వ శతాబ్దం సంచలనాత్మక శాస్త్రీయ ఆవిష్కరణలకు స్వర్ణ యుగం. అలాంటి యుగంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఒక వింతను కనుగొన్నాడు, దానిని చాలా మంది నమ్మలేదు. రాంట్జెన్ యొక్క ఆవిష్కరణ వార్తలు జనవరి 1896 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయి. శాస్త్రవేత్తలు సైతం నివేదికలను ప్రాక్టికల్ జోకర్ ఉపాయం అని కొట్టి పారేశారు. రోగ నిర్ధారణకు కొత్త ఒరవడిని సృష్టించి, ప్రపంచంలో వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్. ఆయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగం లోనె కాక భద్రతా రంగంలో ఉపయోగ పడుతున్నాయి. విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మార్చి 27,1845 - 1923 ఫిబ్రవరి 10) జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యలుల అవధులలో గల ఎక్స్- కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధన వల్ల 1991 లో భౌతిక శాస్త్రంలో మొదటి సారి నోబెల్ బహుమతి పొందాడు. ఆయన చేసిన కృషికి గాను ఆవర్తన పట్టిక లో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టి గౌరవించారు.

రాంట్జన్ 1845 మార్చి 27 న జర్మనీలోని లెన్నెస్ లో జన్మించాడు. ఈయన తండ్రి ఒక రైతు. తల్లి ఒక డచ్ మహిళ. హాలెండ్ లో విద్యాభ్యాసం జరిగింది. 1865 లో యుట్రెచ్ యూనివర్సిటీ లో చేరుటకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని జూరిచ్ లో గల ఫెడెరల్ పాలిటెక్నిక్ సంస్థ లో చేరి పరీక్షలను ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరుగా చేరాడు. 1869 లో తత్వ శాస్త్రములో జూరిచ్ విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను పొందాడు. ఆ విశ్వ విద్యాలయంలో ప్రముఖ ప్రొపెసర్ అయిన ఆగస్ట కుండ్త్ కు ప్రియమైన శిష్యుడయ్యాడు. 1874 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో అద్యాపకునిగా నియమించ బడ్డాడు. 1875 లో హెూహెనీం విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా, తర్వాత 1876 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో మరల అద్యాపకునిగా, 1888 లో గీసన్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యునిగా, తర్వాత వుర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తించాడు. 1900 లో ప్రభుత్వ అభ్యర్థనపై మంచ్ యూనివర్సిటీలో చేరాడు. ఆయన కుటుంబం యు.ఎస్.ఎకు వలస వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. న్యూయార్క్ లో కొలంబియా యూనివర్సిటీ వారు అవకాశం యిచ్చినప్పటికీ మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా తన శేష జీవితాన్ని మునిచ్ నందే గడిపాడు. 1895 వరకు ఉత్సర్గనాళ ప్రయోగాలలో హెర్ట్జ్, జాన్ హిటార్ఫ్, విలియం క్రూక్స్, టెస్లా,లీనార్డ్ లతో పని చేశాడు. ఎక్స్ కిరణాలను రాయింట్ జన్ కిరణాలని అంటారు. కాని రాంట్జెన్ స్వయంగా వాటిని ఎక్స్ కిరణాలని పిలిచాడు. ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు కృతజ్ఞతగా ఆయనకు 1901 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభ్యమయింది. ఈ ఎక్స్ రే వెనుక ఎంతో ఆసక్తి కరమైన కథ ఉంది. రాయింట్ జన్ కేథోడ్ రే ట్యూబ్ (శూన్య



గాజు నాళం) తో పరిశోధనలు చేసేవాడు. గది అంతా చీకటిగా ఉన్నప్పుడు యీ ట్యూబ్ గుండా కాంతి కిరణాలను పంపడం జరిగింది. పైగా ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కాంతి కిరణాలు ఏ కొంచెం కూడా వెలువడ కుండా కప్పి ఉంచాడు. ఇలా చేసినప్పటికి కాథోడ్ ట్యూబ్ కు సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించ సాగింది. నల్లటి కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ కాథోడ్ ట్యూబ్ నుంచి ఏవో అజ్ఞాత కిరణాలు వెలువడి బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం మీద పడి అది మెరిసేటట్లు చేసిందని ఆయన ఊహించ గలిగాడు. ఈ కిరణాలను కాగితం గుండా, చెక్క గుండా, లోహపు పలకల గుండా ప్రయాణం చేయగలవని యీయన కనుగొన్నాడు. ఈ కిరణాలు కూడా ఓ రకమైన కాంతి కిరణాలే అని అయితే వీటి తరంగ దైర్ఘ్యం చాలా తక్కువ కావటం వల్ల మనుషుల కళ్ళకు కనిపించవని రాయింట్జన్ వెల్లడించాడు. మామూలు కాంతి కిరణాలే ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల మీద ప్రభావం చూపుతూ ఉండగా, యీ కిరణాలు మాత్రం చూపకుండా ఉంటాయా అనే ఆలోచన రాయింట్ జెన్ కి రావటం - శాస్త్ర ప్రపంలో ఒక సరికొత్త అధ్యాయానికే కారణ భూతమైనది.

ప్రయోగం చేయటం కోసం రాంట్జెన్ ఫోటో గ్రాఫిక్ ప్లేటు మీద తన భార్య చేతిని ఉంచి యీ కిరణాలను ప్రసారం చేసి ఫోటోను డెవలప్ చేసి చూసి ఆశ్చర్య పోయాడు. చేతి ఎముకలు ఉంగరంతో సహా ఆ ఫోటో లో వచ్చింది. చుట్టూ మాంసం ఉన్నట్లు మసక మసకగా ఉంది. అంటే సజీవంగా ఉన్న మనిషి కంకాళాన్ని ఈ కిరణాల ద్వారా ఫోటో తీయవచ్చని స్పష్టంగా తేలింది. దురదృష్ట వశాత్తు రాంట్జెన్, ఆయనతో కలిసి పనిచేసిన మరో ఇద్దరు పరిశోధకులు యీ ఎక్స్ కిరణాల తాకిడికే క్రమ క్రమంగా మరణించాడు. ఈ ఎక్స్-కిరణాల వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతున్నప్పటికీ వాటిని మితిమీరి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని,యీ కారణంగానే ఎక్స్-కిరణాలను నిరంతరం గురి కాబట్టే రాంట్జెన్ ఆ కిరణాల ప్రభావంగానే చని పోయాడని రుజువైంది. రేడియో ధార్మికత నుండి రక్షించు కొనుటకు సీసపు కవచాలు వాడే కొద్దిమంది మార్గ నిర్దేశకులో ఆయన ఒకరు. ఆయన చేసిన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కూడా తీసుకోలేదు. నోబెల్ బహుమతిగా వచ్చిన ధనమును వర్జ్ బర్గ విశ్వ విధ్యాలయమునకు విరాళంగా యిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల యేర్పడే ద్రవ్యోల్బణం వల్ల రాంట్జెన్ చాలా పేదరికంలో మగ్గాడు. తన శేష జీవితాన్ని మునిచ్కి సమీపంలో గల విల్ హెల్మ్ లో గల యింటిలో గడిపాడు. ఆయన కోరిక ప్రకారం ఆయన వ్యక్తిగత, శాస్త్రమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన మరణం తర్వాత నాశనం చేయటం జరిగింది.

1901 లో రాంట్జెన్ కు మొదటి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ బహుమతి ఆయన ఎక్స్ కిరణాలు కనుగొని విశేష సేవలందించినందుకు గాను యివ్వ బడింది. కాని రాంట్ జెన్ ఆ బహుమతికి వచ్చిన ఆర్థిక ప్రతిఫలాన్ని తన విశ్వ విద్యాలయమునకు దానమిచ్చాడు. పియరీ క్యూరీ వలే రాంట్జెన్ తన పరిశోధనకు పేటెంట్ హక్కులను తిరస్కరించాడు. మానవాళికి తన పరిశోధన యొక్క ఫలితాలు ఉపయోగకరంగా ఉండాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నాడు. రమ్ ఫోర్డ్ మెడల్ (1896), మాటెక్కీ మెడల్ (1896), ఎలియట్ క్రెస్సన్ మెడల్ (1897), భౌతిక శాస్త్రం లో నోబెల్ బహుమతి (1901) పొందాడు.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



## మత సామరస్యాన్ని చాటిన యువకుడు



**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండలంలోని ఆర్లీ టీ గ్రామానికి చెందిన బొంత నితిన్ అనే యువకుడు బుధవారం ఆ గ్రామ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు జహూర్ అహ్మద్,మాజీ మండల కన్వీనర్ సంజీవ్ రెడ్డి,మార్కెట్ కమిటీ సభ్యుడు షేక్ రౌఫ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎండిపోతున్న మొక్కజొన్న కులాలు

**- పరిశీలించిన లింగాల కమల్ రాజ్**

**- ప్రభుత్వాన్ని ఎకరానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్**



**వాస్తవ నేస్తం,ఖమ్మం:** జిల్లాలోని మధిర నియోజకవర్గం బోనకల్ మండలం ఆళ్లపాడు, బోనకల్ గ్రామాల్లో సాగునీరు అందక రైతుల పొలాలు అందక ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న మొక్కజొన్న పంట పొలాలను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ రైతులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నడు రైతులను నష్టపోయే విధంగా కేసీఆర్ నిర్ణయాలు తీసుకోలేదని కానీ అబద్ధపు హామీలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నష్టపోయేలా నిర్ణయాలను తీసుకుంటూ సాగర్ నీటిని విడుదల చేయక రైతులను ఇబ్బందులు పెడుతున్నారు అన్నారు. గతంలో రైతుల కోసం సాగర్ నీటిని పుష్కలంగా వదిలి రైతుల కళ్ళల్లో ఆనందం చూశారు కేసీఆర్ .కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులు నష్టపోయేలా నీటిని విడుదల చేయకుండా పంటలను ఎండబెడుతున్నారని విమర్శించారు.ఎండిపోతున్న మొక్కజొన్న పంటలను కాపాడాలని సాగర్ నీరు అందక నష్టపోయిన ప్రతి ఎకరానికి 25 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం అందించాలని పెట్టుబడి కింద ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తెలంగాణలో దంచికొడుతున్న ఎండలు

**రాబోయే ఐదురోజుల్లో మరింత ఎండల తీవ్రత వాతావరణ శాఖ హెచ్చరిక**

**హైదరాబాద్ :** తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. రాబోయే ఐదురోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు పెరిగేఛాన్స్ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 27 నుంచి 30 వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నల్గొండ, నారాయణపేట, ఖమ్మం,మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది.రాగల ఐదురోజుల పాటు రానున్న ఐదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఇప్పటికే పలు జిల్లాల్లో 42 డిగ్రీలను దాటాయి. రాత్రి పూట 26 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాసత్నాల, తలమడుగులో అత్యధికంగా 42.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది టీఎస్‌డీపీఎస్ తెలిపింది. చాప్రాలలో 42.1, ఆసిఫాబాద్ 42 డిగ్రీలు నమోదవగా.. పలు జిల్లాల్లో 40కిపైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని పేర్కొంది.

## రాజధాని ఉద్యమానికి షార్ట్ బ్రేక్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి రాజధాని ఉద్యమానికి రైతులు తాత్కాలిక విరామం ప్రకటించారు. రాష్ట్రంలో ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అమరావతి జేఏసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నియమావళి, పోలీసుల సూచనల నేపథ్యంలో తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్టు తెలిపింది. శిబిరాలు, రోడ్లమీద కాకుండా ఇళ్ల దగ్గరే నిరసన కార్యక్రమాలు చేపడతామని అమరావతి జేఏసీ తాజాగా ప్రకటించింది.అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 1560 రోజులుగా రైతులు ఆందోళన కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీరికి టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు అండగా ఉన్నాయి. వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలతో ఆందోళన కొనసాగిస్తున్నారు రైతులు. మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రభుత్వం మార్చుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.కాగా, మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పునరుద్ఘాటించింది. శాసన రాజధానిగా అమరావతి ఉంటుందని అంటోంది. అంతేకాదు రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిస్తే విశాఖపట్నంలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని సీఎం జగన్ ఇప్పటికే ప్రకటించారు. వైజాగ్ నుంచే పరిపాలన కొనసాగిస్తానని కూడా ఆయన వెల్లడించారు.

## నాదెండ్లపై జనసైనికులు గరం.. గరం

**గుంటూరు :** జనసేన పార్టీ నేతల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. తమకు బలమున్న చోట, బలమైన నేతలున్న చోట కాకుండా ఇతర స్థానాలను తీసుకోవడం పట్ల వారు గుర్రుగా ఉన్నారు. తొలుత 24 స్థానాలంటే ఒకింత అసహనానికి గురైన క్యాడర్, లీడర్లు.. ఆ తర్వాత 21కి తగ్గించుకున్న తర్వాత ఒకింత ఆందోళనకు గురయ్యారు. పట్టున్న ప్రాంతంలో కాకుండా జనసేనను బలహీనంగా ఉన్న చోట పోటీ చేయించి మరింత వీక్ చేసేందుకు చేసిన ప్రయత్నాల్లో మిత్రపక్షం సక్సెస్ అయిందన్నది నేతల వాదనగా వినిపిస్తుంది. బలమైన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువ స్థానాలను తీసుకోకపోవడంతో పాటు అసలు నేతలే లేని చోట తాము తగుదునమ్మా అంటూ బరిలోకి దిగడం ఎంతవరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా పవన్ కల్యాణ్ ను సీట్ల విషయంలోనూ, స్థానాల ఎంపికలోనూ, అభ్యర్థుల ఖారారులోనూ తప్పుదోవ పట్టించింది

# మద్యం సేవించి ఒక వ్యక్తి మృతి

**- మృతిపై అనుమానాలు ఉన్నాయని వైన్ షాప్ ముందు ఆందోళన**

**- సీసీ టీవీ ఫుటేజ్ ఎందుకు డిలీట్ చేశారని కుటుంబ సభ్యుల ఆగ్రహం**





**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** లోకేశ్వరం మండల కేంద్రంలోని ఒక వైన్ షాపులో మంగళవారం మద్యం సేవించి ఒక వ్యక్తి మృతి చెందగా, మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ గ్రామస్తులు బంధువులు బుధవారం మృతదేహంతో ఆ వైన్ షాప్ ముందు ఆందోళనకు దిగారు. సమయంలోనే వైన్ షాప్ లోని సీసీటీవీ ఫుటేజ్ డిలీట్ ఎందుకు చేశారని బంధువులు నిలదీశారు. మృతుడు పోతురాజు ప్రశాంత్ మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో మద్యం సేవించడానికి ఆ వైన్ షాపులోకి వెళ్ళాడు. మద్యం సేవిస్తూ దాదాపు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుని ముక్కులో నుంచి రక్తం వచ్చిన ఆనవాళ్లు ఉన్నాయని, మృతి పై అనుమానాలు ఉండడంతో సీసీటీవీ పుటేజీ అందించాలని, కుటుంబ సభ్యులు కోరగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సీసీటీవీ పుటేజీ వివరాలు లేవని, పోలీసులతో పాటు వైన్ షాప్ సిబ్బంది చెప్పడంతో వారు ఆందోళనకు దిగారు.

**పోస్టుమార్టం చేయించడం పై అనుమానాలు..?**

బుధవారం ఉదయం భైంసా ప్రభుత్వ ఆసుపత్రిలో మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కాగా ఆర్థోపెడిక్ వైద్యునిచే పోస్టుమార్టం కార్యక్రమం పూర్తి చేయడం కూడా అనుమానాలకు తావిస్తోందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతి పై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటకు వచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని, కుటుంబ పెద్ద మరణించినందున ఆదుకోవాలని వారు భీష్మించుకు కూర్చున్నారు.

# మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయింపు






**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** బీసీ కాలనీకి త్రాగునీరు, మౌళిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైనందుకు నిరసనగా పార్లమెంటు ఎన్నికలు బహిష్కరిస్తామని 2 వ వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ్య అన్నారు. బుధవారం బొల్లారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించారు. 2వ వార్డు కౌన్సిలర్ గోపాలమ్మ ఆధ్వర్యంలో బిసి కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ఈ సందర్భంగా మున్సిపల్ మేనేజర్ నిర్మలా రెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు. బొల్లారం మున్సిపాలిటీ రెండో వార్డ్ బీసీ కాలనీ 1983లో ఏర్పడిందని, కానీ నేటి వరకు మౌలిక వసతులు కల్పనలో గత పాలకులు ఆ కాలనీలో ఉన్న 600 ఇండ్లు 4000 మంది ప్రజానీకాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె వాపోయారు. కనీసం లోకల్ వాటర్ కానీ మంజీరా వాటర్ కానీ లేని దుర్భర పరిస్థితి నెలకొనివుందని ఆవేదన వ్యక్తంచేశారు.విద్యుత్ వ్యవస్థ సరిగా లేదని, అభివృద్ధి చెందుతున్న సమయంలో కూడా నేటికీ వీధిలైట్లు సరిగా లేని కాలనీగా బీసీ కాలనీ మాత్రమే ఉందని చెప్పారు. సీసీ రోడ్డు, అంగన్వాడి కేంద్రం, బస్తి దావఖాన గాని, కమ్యునిటీ హాల్ గాని,రేషన్ షాపు గాని,పార్కు గాని, నోచుకోకపోవడం బీసీ కాలనీ యొక్క దుర్భర స్థితి అని చెప్పారు. 4000 మంది ప్రజానీకం నివసిస్తున్న ప్రాంతంలో రింగ్ రోడ్డుకు లోపల ప్రాంతంలో కనీసం వాకింగ్ ట్రాక్ లేకపోవడము కూడా చాలా దురదృష్టకరం మౌలిక వసతులు కల్పనలో గత పాలకులు బీసీ కాలనీని పూర్తిగా గాలికి వదిలివేయడం జరిగిందన్నారు. గతంలో లోకల్ బాడీ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్, లోకాయుక్త కోర్టుకి, మా సమస్యల గురించి అనేక సార్లు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. కానీ ఎటువంటి స్పందన రాలేదు. గత 30 సంవత్సరాల నుండి ఓట్లు వేయించుకుంటూ అభివృద్ధిలో నిర్లక్ష్యం, కక్ష సాధింపు చర్యలు వల్ల తమ కాలనీ వాసులు ఎంతో వెనుకబడి పోయినట్టు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ భారతదేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతూ ఓట్లు వేస్తూ వచ్చామని, కానీ తమకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించే లేదని, కనుక మేము కాలనీవాసులందరూ నిర్ణయించుకుని వచ్చే మే 13 నాడు జరిగే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని కమీషనర్ కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భారీగా కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లు సజావుగా పూర్తి చేయాలి

**- పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి**

**మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్**






**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పటాన్చెరు సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రానున్న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో ని సమావేశం మందిరంలో సంగారెడ్డి, పటాన్చెరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఏఆర్వోలు, తాసిల్దారులు ,నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ , సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో అతిపెద్ద నియోజకవర్గం పటాన్చెరు నియోజకవర్గమని ఈ నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలలో 391 పోలీసు స్టేషన్లో 20 ఎగ్జిల్లరీ పోలింగ్ స్టేషన్ లు సంగారెడ్డి నియోజకవర్గంలో 281 పోలింగ్ స్టేషన్ లు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గం పరిధిలో ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తతతో ఉండాలన్నారు. ఓటర్ల సంఖ్య పోలింగ్ కేంద్రాల సంఖ్య అత్యధికంగా ఉన్నందున ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు అవసరమైన ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**85 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటివద్దే ఓటు వేసే సౌకర్యం:**

85 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు వికలాంగులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఇంటివద్దే ఓటు వేసే సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. అలాంటి వ్యక్తులను గుర్తించే బాధ్యత ఆయా పోలింగ్ స్టేషన్ ల బిఎల్వోలది అన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు, ధీర కాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వికలాంగులకు ఇంటి వద్ద ఓటు సౌకర్యం కల్పించడానికి అవసరమైన ఫారం 12 డి ని అందజేసి ఎక్నాలెడ్జిమెంట్ తీసుకోవాలని సూచించారు. రెండు నియోజకవర్గాల పరిధిలోని విఐపి ఓటర్లను గుర్తించాలని బిఎల్వో లకు సూచించారు. రెండు చోట్ల ఓటర్లు గా నమోదైన విఐపి ఓటర్ల పేర్లను తొలగించే సమయంలో జాగ్రత్తతో వివరించాలని రెండు పోలింగ్ కేంద్రాల బిఎల్వోలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఏదో ఒకచోట పేరు తొలగించాలని సూచించారు. ఎన్నికల తర్వాత తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుండి ఈవీఎంలు, వివి పాట్లు నర్సాపూర్ లో ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూమ్ కు తరలించే బాధ్యత సెక్టోరియల్ అధికారులు నోడల్ అధికారులదే అన్నారు. అన్ని స్థాయిల ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమన్వయ సమావేశం లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ , మాధురి ,డి ఆర్ ఓ పద్మజారాణి, ఏఆర్వోలు, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, పాల్గొన్నారు.

# నేల మీద పడుకుంటే ఇన్ని లాభాలా..!



గతంలో ఎక్కువమంది నేల మీద చాపలు బంతలు పరుచుకొని నిద్రించేవారు.. కానీ ఈ మధ్యకాలంలో మెత్తటి బెడ్లపైన పడుకుంటే హాయిగా నిద్ర పడుతుందని చాలామంది వీటి మీద నిద్రిస్తూ ఉన్నారు.అయితే ఇందుకోసం కొన్ని వేలకు వేలు ఖర్చుపెట్టి మరి బెడ్స్ ని కొనుగోలు చేస్తూ ఉన్నారు. కానీ బెడ్ పైన కంటే నేలపైన పడుకుంటేనే చాలా మేలు జరుగుతుందని పలువురు వైద్యులు సైతం తెలియజేస్తున్నారు. సాధారణంగా భుజం నొప్పి లేదా కండరాలను నొప్పితో ఇబ్బంది పడేవారు నేలపైన పడుకోవాలని నిపుణులు సైతం తెలియజేస్తున్నారు. నిద్ర సమస్యలు ఉన్నవారు కూడా స్లీపింగ్ స్టైల్స్ ని కూడా మార్చుకోవాల్సి ఉంటుందట. వెన్ను నొప్పితో ఇబ్బంది పడేవారు నేల మీద పడుకోవడం మంచిదని తెలియజేస్తున్నారు.. అయితే మెత్తటి పరుపు పైన పడుకోవడం వల్ల చాలా ఇబ్బందులు తలెత్తుతాయని తెలుపుతున్నారు. నేల మీద పడుకుంటే వెన్ను నొప్పికి సైతం పెట్టవచ్చుని.. అంతేకాకుండా హిప్ఫ్లెక్సర్లు సైతం ఉపశమనం లభిస్తుందని దీనివల్ల నడుము నొప్పి కూడా తగ్గిపోతుందని తెలిపారు. సాధారణంగా ఉదయం లేవగానే చాలామంది కాసేపు కూర్చోకుండా లేస్తూ ఉంటారు. ముఖ్యంగా ఆఫీసులో చాలా గంటల తరబడి కూర్చునేవారు.. మెడ నడుము నొప్పి వంటి సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు.. ఇలాంటివారు నేల మీద పడుకుంటే మంచి ఉపశమనం లభిస్తుంది. నేలపైన నిటారుగా పడుకుంటే నడుము నొప్పి మెడ నొప్పి వంటివి తగ్గిపోతాయట. పనిలో ఒత్తిడి జీవన విధానంలో మార్పుల వల్ల నిద్రలేని సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటే నేల మీద పడుకోవడం వల్ల అలాంటి ఒత్తిడి తగ్గి మంచి సుఖ నిద్ర పడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే రక్తపోటు సమస్యతో ఇబ్బంది పడే వారికి కూడా ఇది చాలా ఫలితాన్ని అందిస్తుందట.

# వీటిని తింటే మెదడు దెబ్బతినడం ఖాయం?

మన బాడీలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో మెదడు మొదటి ప్లేసులో ఉంటుంది.దానిని ఆరోగ్యంగా ఉంచడానికి ఖచ్చితంగా సరైన పోషకాహారం అవసరం.నిజానికి మెదడు మన తలభాగంలో కపాలంతో రక్షించబడి ఉంటుంది.మన జ్ఞానేంద్రియాలన్నింటికి మెదడు ఎంతో ముఖ్యమైన కేంద్రం.అన్ని అవయవాల్లో మెదడు చాలా స్పెషల్.ఎందుకంటే మెదడుకు తనంతట తానే సొంతంగా మరమ్మతులు చేసుకునే గుణం ఉటుంది. ఇంకా మనం ఏం చేయాలన్నా.. తినాలన్నా కూడా మెదడు ఆజ్ఞతోనే జరుగుతుంది. మన మెదడు బలంగా ఉంటేనే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అందుకే మిగిలిన శరీరాన్ని జాగ్రత్తగా చూసుకుంటూ, మెదడును పట్టించుకోకపోతే అంతా వ్యర్థమే.. ఏమి ఉపయోగం ఉండదు.అయితే, మన మెదడుకు ఆరోగ్యంగా ఉండేందుకు కొన్ని ఆహారాలు సహాయపడతాయి.వీటి వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. కానీ.. కొన్ని ఆహారాలు మాత్రం మెదడుకు ఖచ్చితంగా తీవ్ర హాని కలిగిస్తాయి.అవేంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.కొందరు టీ,కాఫీని కూడా ఎక్కువగా తీసుకుంటారు. ఎందుకంటే ఈ రెండింటిలోనూ పెద్ద మొత్తంలో కెఫిన్ ఉంటుంది. ఇది నేరుగా నాడీ కణాలను ప్రభావితం చేస్తుంది. నిద్రను దూరం చేయడానికి సహాయపడుతుంది. ఇది దీర్ఘకాలంలో మెదడుకు మంచిది కాదు.ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, అధిక రక్తపోటు, గుండెపోటు బాధితులుగా మారతారు. అంతేకాకుండా, ఆయిల్ ఫుడ్ కూడా మన మెదడుకు హాని చేస్తుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు, వేయించిన ఆహారాలు, డాల్డా వంటి అధిక మొత్తంలో నూనె, కొవ్వు ఉన్న ఆహారాలు మెదడు ఆరోగ్యానికి హానికరం.ఇంకా అలాగే పంచదార లేదా తీపి పదార్థాలు అధికంగా తీసుకోవడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఉందని మనం తరచుగా చెబుతుంటాం. కానీ మితిమీరిన తీపి పదార్థాలు తినడం మెదడుకు మంచిది కాదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇది ఇన్సులిన్ నిరోధకతను కలిగించడమే కాకుండా మెదడుకు గణనీయమైన నష్టాన్ని కూడా కలిగిస్తుంది.చాలా మంది వేగంగా తింటారు. అయితే వేగంగా తినడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాదని, మెదడుకు సరైన మొత్తంలో న్యూరోట్రాన్స్మిటర్లు అందవని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పైగా ఇది పొగాకును ఎక్కువగా తీసుకున్న దానికంటే హానికరం.. అతివేగంగా తినడం, ధూమపానం రెండూ కూడా మన జ్ఞాపకశక్తిని కోల్పోయేలా చేస్తాయి.



# చేతులు సరిగా కడుక్కోవడం లేదా?




హ్యాండ్‌వాష్.. జీవినశైలిలో ఇప్పుడు ఇదే ముఖ్యమైన అంశంగా మారింది. చేతుల ద్వారానే మనకు అనేక వ్యాధులు వస్తున్నట్లు వైద్యులు గుర్తించారు. అందుకే హ్యాండ్‌వాష్ కోసం ఒక డే కూడా నిర్వహిస్తున్నారు. ఇక కరోనా తర్వాత హ్యాండ్ వాష్‌పై అందరికీ అవగాహన పెరిగింది. అయితే కరోనా తగ్గుముఖం పట్టాక మళ్లీ శుభ్రం చేసుకునే అలవాటు మర్చిపోతున్నారు. చేతులు కడుక్కుంటే చాలా వ్యాధులు మన దరి చేరవు. మనం బయట తిరిగి వస్తాం. ఇంట్లో అమ్మ చేతులు, కాళ్లు కడుక్కో అని చెబుతుంది. కానీ అది పట్టించుకోం. నేరుగా వంటింటిలోకి వెళ్లి.. అన్ని చూస్తాం. ఏదైనా తీసుకుని తినేస్తాం. అయితే ఇలా బయట నుంచి వచ్చినప్పుడు చేతులు కడుక్కోకుంటే కొన్ని రకాల సమస్యలు వస్తాయి. అందుకే శుభ్రంగా ఉండాలి. తర్వాత ఆసుపత్రులకు డబ్బులు పెట్టాల్సిన పరిస్థితి రాదు. అంటు వ్యాధులు ఇప్పుడు ప్రపంచానికి అతిపెద్ద ముప్పుగా మారాయి. ఈ వ్యాధులకు అపరిశుభ్రమైన చేతులు వారధిగా మారుతున్నాయి. కరోనాతోపాటు అనేక జీజనల్ వ్యాధుల వ్యాప్తికి మురికి చేతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతులు అడ్డుపెట్టుకుంటాం. తర్వాత ఎవరో ఒకరికి షేక్ హ్యాండ్ ఇస్తాం. మీ చేతుల నుంచి బ్యాక్టీరియా వారికి చేరుతుంది. దీంతో సమస్య పెద్దది అవుతుంది. ఇతరులు కూడా మీకు షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడూ అదే సమస్య వస్తుంది. అటువంటి పరిస్థితిలో మీ చేతులను సబ్బుతో కేవలం 20 సెకన్ల పాటు కడుక్కోవడం వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు.

# గుండె సమస్యలు ఉంటే గుడ్డు తినవచ్చా?



గుడ్లు.. ప్రతి ఒక్కరు కూడా ఇష్టంగా తినే ఈ గుడ్ల గురించి చాలా మందికి అనుమానాలు, అపోహలు ఉంటాయి. రోజు గుడ్డు తినాలా? వద్దా? తింటే లావు అవుతారా?కొలెస్ట్రాల్ పెరుగుతుందా. అనే భయం ఉంటుంది. అనేక ప్రయోజనాలు ఉన్న కొలెస్ట్రాల్ పెరుగుతుందనే భయం మాత్రం చాలా మందిలో ఉంటుంది. ఇంతకీ గుడ్లను తినవచ్చా? లేదా? ఎన్ని తినాలి? అనే వివరాలు ఇప్పుడు చూసేద్దాం.. ప్రతి గుడ్డులో కొలెస్ట్రాల్ మాత్రం తప్పక ఉంటుంది. అయినా కానీ ఈ కొలెస్ట్రాల్ పెద్దగా ప్రభావం చూపదని చెబుతున్నారు నిపుణులు. ముఖ్యంగా గుండెకు ప్రభావం చూపుతుందనే భయం కూడా లేదంటున్నారు. దీని వల్ల గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం మాత్రం ఉండదట. గుడ్డు పోషకాహార శక్తి కేంద్రాలుగా ఉంటాయనే విషయం తెలిసిందే. వీటిలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ అనేకం. అంతేకాదు ఇందులో కోలిన్ కూడా ఉంటుంది కాబట్టి మెదడు కూడా ఆరోగ్యం ఉంటుంది.లాటిన్, జియాక్సంథిన్, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి పదార్థాలు కళ్ల ఆరోగ్యాన్ని కాపాడడంలో మంచి పాత్ర పోషిస్తాయి. ఇక గుడ్డులోని పచ్చసొన లో ఉండే రిబోఫ్లేవిన్ ఆరోగ్యంగా ఉండడానికి, పెరుగుదలకు అవసరమయ్యే విటమిన్ డి ఎముకలను ఆరోగ్యంగా ఉంచేలా తోడ్పడుతుంది. ఇక విటమిన్ బి-12 ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయం చేస్తుంది. మెదడు ఆరోగ్యానికి కూడా మంచిది గుడ్డ పచ్చసొన. దీన్ని మితంగా తీసుకుంటే బరువు పెరుగుదలలో నియంత్రణ ఉంటుంది. గుండె సమస్యలు లేని వారు ప్రతి రోజు రెండు గుడ్లను తినవచ్చు అంటారు నిపుణులు. లేదంటే రోజు ఒక గుడ్డుతో సరిపెట్టుకోవాలి అని చెబుతున్నారు. వైద్యపరమైన, శారీరక సమస్యల ఉంటే కొలెస్ట్రాల్ విషయంలో భయపడాలని.. లేదంటే గుడ్లను తినడానికి ఎలాంటి భయం అవసరం లేదంటున్నారు డైటీషియన్లు. మరి తెలుసుకున్నారుగా ఒకసారి మీ వైద్యుడిని కూడా సంప్రదించి తినేయండి.

# మీరు తాగే నీళ్లు మినరల్ నా..



వేసవి కాలం వచ్చేసింది. ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరదు. ఇక ప్రయాణాల్లో అయితే మరింత ఎక్కువ నీళ్లు తాగుతాం. అయితే ఎక్కడ పడితే అక్కడ నీళ్లు తాగితే గొంతు పాడవుతుంది. కలుషిత నీరుతో వాంతులు విరోచనాలు అవుతాయి. దీంతో చాలా మంది ప్రయాణికులు వాటర్ బాటిల్ కొని తాగుతుంటారు. బాటిల్ నీళ్లు చాలా శుభ్రమైనవని భావిస్తారు. అయితే, నీళ్ల వ్యాపారం కోట్ల రూపాయాల్లో సాగుతుండడంతో చాలా కంపెనీలు పుట్టుకొచ్చాయి. జనరల్ వాటర్‌నే బాటిళ్లలో నింపి మినరల్ వాటర్‌గా అమ్మేస్తున్నాయి. మీరు డబ్బులు పెట్టి కొని తాగే బాటిల్‌లో ఉన్నవి మినరల్ వాటరేనా అంటే చాలా మంది అవుననే అంటారు. కానీ చాలా మంది ఇలానే మోసపోతున్నారు. ఎందుకంటే కంపెనీలు జనరల్ వాటర్‌ను మినరల్ వాటర్‌గా అంటగడుతున్నాయి. అయితే మినరలా జనరలా ఇలా తెలుసుకోవచ్చు. ఐఎస్ఐ మార్కుతోపాటు 14543 నంబర్ ఉన్నా కూడా నీళ్లు మినరల్ కాదని డౌట్ వస్తే ఇలా చేయాలి. బీఐఎస్ కేర్ అనే యాప్ ఓపెన్ చేసి అందులో ఐఎస్ఐ వెరిఫై లైసెన్స్ డీటెయిల్స్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత ఐఎస్ఐ మార్కు కింద ఉన్న నంబర్‌ను ఎంటర్ చేయాలి. దీంతో ఆ బాటిల్ ఏ కంపెనీకి చెందినది, ఎక్కడ తయారు చేశారు అనే వివరాలు తెలుస్తాయి. ఆ నీటిలో ఉన్న మినరల్స్, దాని లైసెన్స్, వ్యాలిడిటీ అన్ని వివరాలు కనిపిస్తాయి. మీరు కొన్నవాటర్ బాటిల్ ఫేక్ అని నిర్ధారణ అయితే బీఐఎస్‌కేర్ యాప్‌లోనే ఫిర్యాదు కూడా చేయవచ్చు. వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.ఫోన్‌లో బీఐఎస్ కేర్ యాప్ ఉంటే మనం తాగే నీళ్లు మంచివా కావా ఇట్టే తెలుసుకోవచ్చు.

# తమలపాకే కదా అని పారేస్తున్నారా?




తమలపాకును ఈ రోజుల్లో చాలా మంది వాడుతున్నారు. పూజలు చేస్తున్న చాలా మంది తాంబూలం ఇస్తే కచ్చితంగా తమలపాకు ఉంటుంది. కానీ ఈ తమలపాకును పారేసే వారే ఎక్కువ. మరో ముఖ్య విషయం ఏంటంటే.. భోజనం చేసిన తర్వాత పాన్ తినడానికి ఇష్టపడే వారు ఎందరో ఉన్నారు. ఆహారం జీర్ణం అవ్వడానికి సహాయపడుతుంది. తమలపాకు నీళ్లు చాలా మంచివి అని చెబుతున్నారు నిపుణులు. అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుందట. తమలపాకు నీరు జలుబు, దగ్గుకు మేలు చేస్తుంది. మరిన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి.. ఇంతకీ అవేంటంటే.. 3-4 తమలపాకును నీటిలో కడిగి మూడు గ్లాసుల నీటిలో మరిగించాలి. నీరంతా మరిగి ఒక గ్లాస్ నీరు అయినప్పుడు చల్లార్చి రోజుకు రెండు మూడు సార్లు తాగాలి. దీని వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి అంటున్నారు నిపుణులు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో తోడ్పడుతాయి. అందుకే ఈ వ్యాధి ఉన్నవారు ఈ నీటిని తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది. ఈ రోజుల్లో మలబద్ధకం సమస్యతో బాధ పడే వారు ఎక్కువగా ఉన్నారు. ఈ సమస్య ఉన్నవారికి కూడా తమలపాకు వాటర్ మంచి ప్రయోజనాలను అందిస్తుంది.యాంటీ ఇన్ ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్ గుణాలు పుష్కలంగా ఉన్న తమలపాకు నీరు దగ్గు, పిత్త దోషాలను నయం చేయడంలో మంచి ఔషధం. గొంతు వాపును, ఛాతీలో పేర్కొని పోయిన కఫాన్ని తొలగిస్తుంది. వాంతులు, విరేచనాలు, వికారం వంటి సమస్యలు ఉంటే కూడా తమలపాకు నీరు చాలా ఉపయోగపడుతాయి. తమలపాకు నీరు జీర్ణ శక్తిని సమతుల్యంగా ఉంచడంలో తోడ్పడుతుంది. ఈ నీటి వల్ల జీర్ణ శక్తి ఆరోగ్యంగా ఉంటుంది.తమలపాకు వాటర్ తో చెడు వాసన కూడా దూరం అవుతుంది. దీనితోపాటు దంతాలను కూడా శుభ్రపరుస్తుంది. మరి తెలుసుకున్నారు కదా తమలపాకు నీటి వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో.. ఇంకెందుకు ఆలస్యం ఈ సారి ఓసారి ట్రై చేయండి. కానీ జాగ్రత్త సుమ. కొత్తగా ఏది ట్రై చేసినా కాస్త క్షుణ్ణంగా పరిశీలించాల్సిందే.

http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
స్థానిక వార్తలు



## వేగంగా కొనసాగుతున్న మూల్యాంకనం



**హైదరాబాద్ :** తెలంగాణ ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తైన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు జరిగాయి. ఇక ఇప్పటికే ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) కూడా ప్రారంభమైంది. మూల్యాంకనం ప్రక్రియను ఇంటర్ బోర్డు మరింత కట్టుదిట్టంగా నిర్వహిస్తోంది. మూల్యాంకన కేంద్రాల్లో విధులకు హాజరయ్యే అధ్యాపకుల ఫోన్లను అనుమతించకూడదని ఇంటర్ బోర్డు ఆదేశించింది. కేంద్రాల్లోకి గతంలో ఫోన్లను అనుమతించడం వల్ల సమస్యలు తలెత్తాయని, ఆ సమస్యలు పునరావృతంకాకుండా వెంటనే స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లోకి ప్రవేశించే ముందు అధ్యాపకులు తమ ఫోన్లను సెక్యూరిటీ గార్డులకు డిపాజిట్ చేయాలని బోర్డు సూచించింది. అలాగే పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం చేసే గదుల్లో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. మూల్యాంకనం చేసే సమయంలో బయటి వ్యక్తులతో ఎలాంటి సంబంధాలకు తావు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మూల్యాంకనం చేసేందుకు సమాధాన పత్రాలు తీసుకున్నప్పటి నుంచి, తిరిగి సంబంధిత అధికారికి వాటిని ఇచ్చే వరకు హాలులోనే ఉండాలని సూచించింది. గదిని దాటి బయటకు వచ్చిన ప్రతిసారీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థుల సమాధాన పత్రాల కోడింగ్ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, అక్రమాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు బోర్డు తెలిపింది. అధ్యాపకులు పూర్తిచేసిన మూల్యాంకన పత్రాల వివరాలు ఎప్పటికప్పుడు రాష్ట్ర కార్యాలయానికి తరలించేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొంది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 10 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల మూల్యాంకనం కోసం రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 60 లక్షల పేపర్లు మూల్యాంకన కేంద్రాలకు చేరుకున్నాయి. వీటిని మూల్యాంకనం చేసేందుకు సబ్జెక్టుల వారీగా 20 వేల మంది అధ్యాపకులు ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఒక్కో అధ్యాపకుడు ఉదయం 15 పేపర్లు, సాయంత్రం 15 పేపర్లు చొప్పున.. రోజుకు కేవలం 30 పేపర్లు మాత్రమే మూల్యాంకనానికి ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాణ్యమైన మూల్యాంకనం లక్ష్యంగా ఈ విధానాన్ని అవలంభిస్తున్నట్లు పరీక్షల విభాగం అధికారులు చెబుతున్నారు. మూల్యాకనం అనంతరం పది రకాలుగా పరీక్షించిన తర్వాతే ఆ మార్కులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఒకరు పొరపడ్డా, మరో ఎగ్జామినర్ దాన్ని పరిశీలించి విద్యార్థి మార్కులు కోల్పోయే అవకాశం లేకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ రెండో వారానికల్లా స్పాట్ పూర్తి చేసి, సాంకేతిక లోపాలుంటే మూడో వారంలో సరిచేసి, నాల్గవ వారంలో ఫలితాలు వెల్లడించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ ఆలస్యమైతే మే మొదటి వారంలో ఫలితాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేశారు.

## గోవా నుంచి పోలింగ్ స్టేషన్‌కు...

**మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ బైపోల్ మాజీ సీఎం కేసీఆర్‌ను టెన్షన్ పెడుతోంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ఆయన పడరాని పాట్లు పడుతున్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో గోవాలో క్యాంప్ ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా గోవా వెళ్లారు. గోవాలో మహబూబ్‌నగర్ జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం కేటీఆర్ నేతృత్వంలో క్యాంప్ పెట్టడంపై రాజకీయంగా వాడివేడి చర్చ జరుగుతోంది. ఈ నెల 28న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరగబోతోంది. బైపోల్ కోసం గోవాలో క్యాంప్ పెట్టడంపై పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓటమి భయంతోనే గోవాలో క్యాంప్ పెట్టారంటుని గులాబీ నేతలే అంటున్నారు. ఎమ్మెల్సీ బైపోల్‌లో ఓడిపోతే పరువు పోతుందని, ఆ ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపైనా పడుతుందని కేసీఆర్, కేటీఆర్ ఆందోళనలో ఉన్నారు. ఇదే జరిగితే తెలంగాణలో కారు పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## బీజేపీ అభ్యర్థికి ఘన స్వాగతం

**ఖమ్మం :** బిజెపి ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్ రావుకు బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టికెట్ కేటాయించిన తరవాత తొలిసారి జిల్లాకు వస్తున్న వినోద్ రావుకు ఘన స్వాగతం లభించింది. ద్విచక్ర వాహనాలతో యువత పెద్ద ఎత్తున చేరుకొని, బిజెపి జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. జై బిజెపి జై నరేంద్ర మోడీ, జై తాండ్ర వినోద్ రావా అంటూ నినాదాలు చేసారు. తరువాత వినోద్ రావు మాట్లాడుతూ ఈ రోజు నరేంద్ర మోడీ, జేపీనడ్డా, కిషన్ రెడ్డి లు నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చారు. ఖమ్మం జిల్లా ప్రజలకు నిధులు అందించేందుకు నన్ను సమర్థుడిగా భావించి నాకు అవకాశం ఇచ్చారు. ర్యాలీ కి వచ్చిన ప్రజల ముఖంలో నా మీద, నరేంద్ర మోడీ మీద ఉన్న ప్రేమ కనిపించింది. మొదటి సారి ఖమ్మం జిల్లాలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం. పార్టీలకు అతీతంగా ప్రజలు ఖమ్మం జిల్లాలో బీజేపీ కి ఓటు వేసి నన్ను గెలిపిస్తారని అన్నారు. బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు మాట్లాడుతూ బీజేపీ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 17 సీట్లలో ఎక్కువ సీట్లు గెలుపొందుతుంది. దేశంలో బాంబులు, తుపాకుల శబ్దం తగ్గిపోయింది. మోడీనీ మూడవసారి అధికారంలోకి తీసుకుని రావడానికి యువత ఆలోచిస్తుంది. 500 వందల సంవత్సరాల అయోధ్య సమస్యను పరిష్కరించింది బీజేపీ.

## పోలీస్ నక్సలైట్ల మధ్య ఎదురు కాల్పులు

**బీజాపూర్ :** బీజాపూర్ ఆడవుల్లో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు డిప్యూటీ కమాండర్తో సహా ఆరు మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతి చెందిన నక్సలైట్లలో మహిళా నక్సలైట్ మృతదేహం కూడా లభ్యం అయింది. ఘటన ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నాయి.
పోలీసులంతా క్షేమం. సెర్చ్ ఆపరేషన్ లో కోబ్రా 210, 205, సీఆర్పీఎఫ్, డీఆర్జీ సిబ్బంది ఉమ్మడి బృందం పాల్గొన్నారు. హతమైన నక్సలైట్ల మృతదేహాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

# ఎన్నికల నియమావళి అమలులో ప్రజలు, మీడియా సహకరించాలి

- తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దు
- అన్ని శాఖల అధికారులతో సమన్వయం
- జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే




**వాస్తవ నేస్తం,కోదాడ:** మే నెలలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమలుకు ప్రజలు, మీడియా సహకరించాలని సూర్యాపేట జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే కోరారు. ఎన్నికల నియమావళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గూర్చి బుధవారం రోజున ఎస్పి కార్యాలయం నందు నిర్వహించి మీడియా ది మీట్ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు గాను పోలీస్ శాఖ సిద్ధంగా ఉన్నదని చెప్పారు. ఇతర శాఖలతోని కలుపుకొని సమన్వయంతో ముందుకు పోతున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు రెండు కోట్ల రూపాయల విలువగల నగదు, బంగారం, వెండి సీజ్ చేశామని, అన్ని రకాలుగా అనుమతులు ఉన్న వాటిని వెంటనే రిలీజ్ చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నియమావళి అమలులో తీసుకోవాల్సిన విషయాలపై చర్చించడం జరిగిందని, చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశామని, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి టీములు నిరంతరం నిఘా పెట్టాయని వెల్లడించారు. తప్పుడు సమాచారాన్ని పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో సోషల్ మీడియాలో, వాట్సాప్ లలో ప్రచారం, ప్రసారం చేయవద్దని కోరినారు. పాత సమాచారాన్ని కొత్తదిగా చూపిస్తూ వ్యక్తులను, వ్యవస్థలను కించపరిచే విధంగా అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, సోషల్ మీడియాలో పోస్టులకు గ్రూపు అడ్మిన్ లు జాగ్రత్తలు వహించాలని, వాట్సాప్ లో తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే గ్రూప్ అడ్మిన్ లను కూడా బాధ్యులను చేస్తామని చెప్పారు. నిరంతరం మీడియా, సోషల్ మీడియా లపై పోలీసు నిఘా ఉంటుందని, తప్పుడు ప్రచారాలకు, ప్రసారాలకు, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే క్రిమినల్ చర్యలకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అధ్యక్షతన మీడియా సెంటర్ కూడా నిర్వహిస్తున్నాం, పెయిడ్ ఆర్టికల్స్ పై కూడా నిఘా పెట్టడం పెట్టామన్నారు. ఏదైనా సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రచురణ, ప్రసారం చేయాల్సిన సందర్భం ఉంటే అందుకు కావలసిన విషయాలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కూడా తీసుకుంటే బాగుంటుందని ఎస్పి సూచించారు. అంతేగాని తప్పుడు సమాచారాన్ని తొందరపడి రిలీజ్ చేసి ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఎస్పి సమాధానం ఇచ్చారు ఇంకా ఈ మీడియా మీట్ లో జిల్లా అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు, అధనపు ఎస్పి జనర్ధన్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి రవి, కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డిలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకం






- సెక్టార్ అధికారులకు మాక్ పోల్ శిక్షణ
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడినప్పటి నుండి ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే కీలక బాధ్యతలు నిర్వాహర్తించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సంగారెడ్డి , పటాన్ చెరువు పరిధిలోని సెక్టార్ అధికారులకు పోలింగ్ నిర్వహణ పై మాక్ పోల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా మాక్ పోల్ డాక్యుమెంటరీని ప్రదర్శించారు ఈ సందర్భముగా జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. సెక్టార్ అధికారులకు సాంకేతిక అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల అధికారులు, గతంలో ఎన్నికల విధులు నిర్వహించినా శిక్షణ అనేది చాల ముఖ్యమై నదని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమై న అన్ని రకాల చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలింగ్ రోజు ప్రతి పోలింగ్ స్టేషన్ లలో మాకేపోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని తెలిపారు. ప్రతి సెక్టార్ అధికారులకు 12 పోలింగ్ స్టేషన్‌ల పరిధి ఉంటుందని, సెక్టార్ అధికారులు ప్రతి పోలింగ్ స్టేషన్ లో మౌలిక సదుపాయాలు, ఓటర్ లిస్టు ముందుగా పరిశీలించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజా రాణి, ఆర్డీఓలు, నోడల్ అధికారులు ఎన్నికల సిబ్బంది హాజరైనారు.

# ప్రచారం దూసుకుపోతున్న ఎంపీ అభ్యర్థి సుభాష్ రాథోడ్





వాస్తవ నేస్తం,నిర్మల్: లోక్ సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు సుభాష్ రాథోడ్ ప్రచారంలో వేగం పెంచారు. బుధవారం నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గతంలో గెలిచిన నాయకులు తమ అభివృద్ధి చూస్తున్నారు తప్ప, ప్రజల కోసం అభివృద్ధి పనులు చేయలేదని అన్నారు. ఇప్పటికి ఆదివాసీ గూడాలకు, లంబాడి తాండలకు రోడ్డు సౌకర్యాలు లేవని అన్నారు. రోడ్డు సౌకర్యం లేక వాగు దాటి రావడానికి గంటల తరబడి శ్రమించి గర్భిణీ ని ప్రసవం కోసం ఆదివాసీ మహిళను రోడ్డు పై తీసుకోచ్చే దాకా ఆమె రోడ్డు పైనే ప్రసవించిందని గుర్తు చేశారు. కొట్టుకపోయినా పస్పుల్ల గ్రామానికి వెళ్లే బ్రిడ్జి కొట్టుకపోయి ఏండ్లు గడుస్తున్న కూడా ఎవరు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. గెలిచినా ఒక సంవత్సరంలోనే ప్రతీ గ్రామానికి పక్క రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ ఉన్నప్పుడే గ్రామపంచాయతీలో రైతుల కోసం వ్యవసాయ క్షేత్రాలకు రోడ్డు సౌకర్యం కల్పించానని, ఎంపీ గా గెలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కొట్లాడి అభివృద్ధి పనులు తీసుకొస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# ఆ హీరో దర్శకత్వంలో నటించేందుకు నయన్ గ్రీన్ సిగ్నల్..!



కోలీవుడ్ నటుడు శశికుమార్ దర్శకత్వంలో నటించేందుకు లేడీ సూపర్ స్టార్ నయనతార పచ్చజెండా ఊపారా? ఈ ప్రశ్నకు కోలీ వుడ్ వర్గాల నుంచి అవుననే సమాధానమే వినిపిస్తోంది. సుబ్రమణ్య పురం చిత్రం ద్వారా కథానాయకుడు, దర్శకుడిగా పరిచయమైన శశికుమార్ ఆ తరువాత నాడోడిగళ్ చిత్రంలో నటించారు. ఈ రెండు చిత్రాలు ఘన విజయం సాధించడంతో శశికుమార్ హీరోగా స్థిరపడిపోయారు. పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. ఈయన ఈ మధ్య కథానాయకుడిగా నటించిన అయోధి చిత్రం మంచి విజయాన్ని సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలను అందుకుంది. ఇక నటి నయనతార విషయానికి వస్తే లేడీ సూపర్‌స్టార్‌గా ఆమె రాణిస్తున్నారు. ఇటీవల జవాన్ చిత్రంతో బాలీవుడ్‌లోనూ విజయాన్ని అందుకున్నారు. గతేడాది ఆమె ఎన్నో అంచనాలు పెట్టుకున్న తన 75వ చిత్రం అన్నపూరణి తీవ్ర నిరాశ పరిచింది. అంతే కాకుండా వివాదాల్లో చిక్కుకుని కేసుల వరకూ వెళ్లి ఓటీటీలో నుంచి తొలగించారు. ఇదిలా ఉండగా.. నయన్‌కు అవకాశాలు ఏ మాత్రం తగ్గడం లేదు. అయితే విజయాలే ముఖం చాటేస్తున్నా యి. ప్రస్తుతం టెస్ట్ అనే క్రికెట్ నేపథ్యంలో సాగే చిత్రంతో పా టు మన్నాంగట్టి అనే హీరో యిన్ సెంట్రిక్ కథా చిత్రం లో నటిస్తూ బిజీగా ఉన్నా రు. కాగా తాజాగా నటుడు శశికుమార్ దర్శకత్వంలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్త సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరలవుతోంది. ఇదీ హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రంగా ఉంటుందని సమాచారం. ఇందులో నయనతార పాత్ర చాలా బలంగా ఉంటుందని తెలిసింది.

# నక్షత్రంలా మృణాళ్ ఠాకూర్ మెరుపులు



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో అగ్ర దర్శకనిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది బాలీవుడ్ భామ మృణాళ్ ఠాకూర్ ఈ మరాఠీ ముద్దుగుమ్మ సీతారామం సినిమాతో తెలుగుతోపాటు ఇండియావైడ్‌గా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. రీసెంట్‌గా నానితో కలిసి నటించిన హాయ్ నాన్న బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త గెటప్స్‌లో హాట్ హాట్ లుక్‌లో కనిపిస్తూ సందడి చేసే ఈ భామ తాజాగా కంప్లీట్ డాటెడ్ బ్లాక్ డ్రెస్‌లో మత్తెక్కించే కండ్లతో హొయలు పోతూ ఫొటోలు దిగింది. బ్యాక్ లుక్‌లో హొయలుపోతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వాన్ గోహ్ నక్షత్రాలతో చిత్రించిన ప్రపంచంలో.. అంటూ షేర్ చేసుకున్న తాజా లుక్స్ నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ఇటీవలే మృణాళ్ ఠాకూర్ పాపులర్ కోసం కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చిన విషయం తెలిసిందే. బ్లాక్ అండ్ గ్రీన్ కాస్ట్యూమ్స్‌లో మెరిసిపోతున్న మృణాళ్ ఠాకూర్ స్టిల్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ఈ భామ ప్రస్తుతం విజయ్ దేవరకొండతో కలిసి ఫ్యామిలీ స్టార్ సినిమాలో నటిస్తోంది. ఈ మూవీ ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మరోవైపు హిందీలో నటిస్తుండగా.. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.



# నటిగా రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టా

నటనపై తనకున్న ప్రేమ... ఆసక్తే ఇన్నేళ్ల తర్వాత మళ్లీ తనని తెలుగు చిత్ర పరిశ్రమకి వచ్చేలా చేసిందన్నారు ప్రశాంతి హారతి. వివాహం, కుటుంబ బాధ్యతల వల్లే ఇరవయ్యేళ్లుగా నటనకు దూరం కావల్సి వచ్చిందన్నారామె. 'ఇంద్ర' సినిమాలో ముంతాజ్‌గా, 'పెళ్లాం ఊరెళితే' సినిమాలో సునీల్ భార్యగా నటించి గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రశాంతి హారతి. 'ఫిబ్రవరి 14 నెక్లెస్ రోడ్', 'రూపాయి'తోపాటు పలు చిత్రాల్లోనూ, ధారావాహికల్లోనూ నటించారు. కూచిపూడి నృత్య కళాకారిణి అయిన ప్రశాంతి... పెళ్లి తర్వాత అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడే కూచిపూడి డ్యాన్స్ స్కూల్స్‌ని నిర్వహిస్తున్నారు. నటిగా రోండో ఇన్నింగ్స్‌ని మొదలు పెట్టానంటూ ఆమె మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. "చిన్నప్పుడు నృత్యమే నాకు ప్రపంచం. నృత్య ప్రదర్శనలు, ఫొటో మోడలింగ్ వల్ల సినిమా రంగం నుంచి అవకాశాలొచ్చాయి. అలా అనుకోకుండానే చిత్ర పరిశ్రమకి వచ్చి గుర్తింపు తెచ్చుకున్నా. ఇంతలో పెళ్లి నా నట ప్రయాణాన్ని మలుపు తిప్పింది. సినీ రంగాన్ని వదిలిపెట్టి వెళ్లిపోవడం బాధగా అనిపించింది. ఆ తర్వాత కుటుంబ బాధ్యతలు, పిల్లల్ని చూసుకుంటూనే ఆమెరికాలో నృత్య పాఠశాలల్ని నిర్వహించా. నటనపై నాకున్న మక్కువని గమనించిన నా భర్త, నా పిల్లలు మళ్లీ సినిమా కెరీర్‌ని పునః ప్రారంభించాలని ప్రోత్సహించారు.




# ఆమెతో పోలిక ఆనందమే

మలయాళంలో లేటెస్ట్ హిట్ 'ప్రేమలు' చిత్రంతో యువతరం గుండెల్లో గూడు కట్టేసుకుంది మమితా బైజు. కేవలం ఈ అమ్మాయి కోసమే 'ప్రేమలు' సినిమాను మళ్లీ మళ్లీ చూస్తున్నారు యూత్.ప్రస్తుతం ఈ కేరళ అందాన్ని తెలుగులోకి లాగేయడానికి చాలామంది దర్శక, నిర్మాతలు ప్రయత్నాలు కూడా ముమ్మరం చేశారని సమాచారం. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ వేడుకలో పాల్గొన్న ఈ బంగారు బొమ్మ తన కెరీర్ గురించి ఆసక్తికరమైన విషయాలు తెలిపారు. 'చిన్నప్పట్నుంచీ యాక్టింగ్ అంటే ఇష్టం.'సర్వోపరి పలక్కరన్' నా తొలి సినిమా. ఆ తర్వాత చాలా సినిమాల్లో నటించాను. షార్ట్ ఫిల్మ్ కూడా చేశాను. కానీ 'ప్రేమలు' నన్ను ప్రపంచానికి పరిచయం చేసింది.తమిళంలో జీవీ ప్రకాష్‌కుమార్ హీరోగా నటిస్తున్న 'రెబల్' సినిమాలో చేస్తున్నాను. అవకాశాలు చాలానే వస్తున్నాయి కానీ, అన్నీ చేయను. నచ్చితేనే చేస్తా.' అంటూ చెప్పుకొచ్చింది మమిత. మిమ్మల్ని చాలామంది సాయిపల్లవితో పోలుస్తున్నారు?పైగా మీరే సాయిపల్లవికి సరైన పోటీ అనే టాక్ కూడా నడుస్తున్నది? దీనిపై మీ అభిప్రాయం? అనడిగితే 'ఆమె గ్రేట్ ఆర్టిస్ట్. నాకు ఇన్‌స్పిరేషన్. అలాంటి మంచి యాక్టర్స్‌తో పోలుస్తున్నారంటే ఆనందమేగా!? ఇక పోటీ అంటారా? నా కెరీర్ మొదలైందే ఇప్పుడు.. అప్పుడే పోటీ దాకా ఎందుకు..' అంటూ అందంగా నవ్వేసింది మమిత.



# అరణ్మనై 4ను చూసేందుకు రెడీ కండి!



సుందర్ సి స్వీయదర్శకత్వంలో వస్తున్న తాజా ప్రాజెక్ట్ అరణ్మనై 4 అరణ్మనై ఫ్రాంచైజీలో వస్తోన్న ఈ మూవీలో తమన్నా, రాశీఖన్నా ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. చాలా రోజుల తర్వాత ఈ మూవీకి సంబంధించిన ఇంట్రెస్టింగ్ ఆసక్తికర వార్తను షేర్ చేసింది మేకర్స్ టీం. ఇప్పటికే మేకర్స్ అరణ్మనై 4 ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ లాంఛ్ చేయగా.. తల్లి తన కుమారుడు, కూతురును ఓ ఇంట్లోకి తీసుకెళ్తున్న లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. తాజాగా మరో లుక్ విడుదల చేశారు. కొందరంటారు ఈ ఖరీదైన విల్లా చలిగా ఉంటుందని, ఈ భవంతి చాలా చల్లగా ఉంటుందని మరికొందరు చెబుతారు. ఈ ఏప్రిల్‌లో అరణ్మనై 4 వేసవికి చక్కటి నవ్వుతోపాటు చల్లదనాన్ని, థ్రిల్‌లను అందించేందుకు వస్తోంది కావున మీరంతా సిద్ధంగా ఉన్నారా? అంటూ కొత్త పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. ఫొటో ఫ్రేమ్‌లో సుందర్ సీ, కోవై సరళ, యోగి బాబు కనిపిస్తుండగా.. మరోవైపు తమన్నా, రాశీ ఖన్నా, ఓ విల్లా, దాని ముందు కారును చూడొచ్చు. అరణ్మనై 4 చిత్రంలో కోవై సరళ, యోగిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హిప్ హాప్ తమిళా మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను %ూజఅఱ జఱఅవఎఱఇ, దీవఅఓఓ వీవసఉఖ% సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఇంతకీ ఈ మూవీ విడుదల తేదీ ఎప్పుడనేది మాత్రం క్లారిటీ ఇవ్వలేదు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com